ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
శనివారం 17, ఫిబ్రవరి 2024



ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సూర్యవందనం చేస్తున్న విద్యార్థులు



సూర్యప్రభ వాహనంపై ఒంగోలులోని చెన్నకేశవస్వామి



శేష వాహనంపై మార్కాపురంలోని చెన్నకేశవస్వామి

నమో సూర్యదేవా..

- భక్తి శ్రద్ధలతో రథసప్తమి
- ఒంగోలులో మూడువేల మంది విద్యార్థులతో సూర్యవందనం

మార్కాపురం వన్‌టౌన్ / ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : రథసప్తమిని జిల్లావ్యాప్తంగా ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామికి తిరుమల తరహాలో సప్తవాహన సేవ నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో మార్కాపురం పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకొంది. ఉదయం సూర్యప్రభ, శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, చంద్రప్రభ వాహనాలపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి వెండిరథంపై అంగరంగ వైభవంగా నగరోత్సవం నిర్వహించారు.

ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం మధ్యాహ్నం మూడువేల మంది విద్యార్థులతో మహా సూర్యవందనం నిర్వహించారు. ప్రణవ్ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, భారత్ వరల్డ్ రికార్డ్ నమోదులో భాగంగా యోగాపై అవగాహన పెంపొందించేందుకు మహాసూర్యవందనం నిర్వహించినట్లు తెలిపారు.

పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా గుత్తా

- వ్యాపారుల కోటాలో అవకాశం
- పాలక మండలి సమావేశంలో ఎన్నిక
- చైర్మన్, వైస్ చైర్మన్ రెండూ దక్షిణాదికే
- కర్ణాటకలో 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి



వాసుబాబును అభినందిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్‌బాబు, సెక్రటరీ వేణుగోపాల్

ఒంగోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భారత పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా ఒంగోలుకు చెందిన వ్యాపారి గుత్తా వాసుబాబు ఎన్నికయ్యారు. గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జడ్పీ మాజీ చైర్మన్, ప్రముఖ పొగాకు వ్యాపారి దివంగత గుత్తా వెంకటసుబ్బయ్య కుమారుడైన వాసుబాబు ఆ వ్యాపారంలో కొనసాగుతున్నారు. బోర్డులో వ్యాపారుల ప్రతినిధుల కోటాలో 2022 సెప్టెంబరులో డైరెక్టర్‌గా నియమితులైన ఆయన ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. బోర్డు చైర్మన్‌ను కేంద్రం నియామకం చేస్తుండగా వైస్ చైర్మన్‌గా పాలకమండలిలో ఉండే రైతు, వ్యాపార ప్రతినిధులకు రొటేషన్ పద్ధతిలో అవకాశం వస్తుంది. అయితే మూడు విడతలుగా రైతు ప్రతినిధులే ఎన్నిక అవుతుండగా ఇప్పటివరకు కర్ణాటకకు చెందిన వ్యక్తి ఉన్నారు. ఆయన పదవీ కాలం ముగియడంతో శుక్రవారం జరిగిన పాలక మండలి సమావేశంలో వైస్ చైర్మన్ ఎన్నిక జరిగింది. ఈసారి కూడా తమ ప్రతినిధికే అవకాశం ఇవ్వాలని అది కూడా ఆంధ్ర ప్రాంతానికి కేటాయించాలని సమావేశంలో రైతు ప్రతినిధులు పట్టుపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం రైతు ప్రతినిధులుగా జిల్లాకు చెందిన వారే ముగ్గురు ఉండగా వారిలో బీజేపీకి చెందిన పోద ప్రసాదరావు, బ్రహ్మయ్యలు గట్టిగా ప్రయత్నించారు. వ్యాపారుల ప్రతినిధులు మాత్రం ఈ విడత తమకు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈక్రమంలో యువకుడైన గుత్తా వాసుబాబును వైస్‌చైర్మన్‌గా ఎన్నుకున్నారు. దీంతో కీలకమైన చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు రెండూ దక్షిణాదికే దక్కాయి. కందుకూరు నియోజకవర్గం నలదలపూడికి చెందిన చిడిపోతు యశ్వంత్‌కుమార్ ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతుండగా, ఇప్పుడు ఒంగోలు వాసి అయిన గుత్తా వాసుబాబు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే వాసుబాబు స్వగ్రామం కూడా కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెం కావడం విశేషం. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన వాసుబాబును బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్‌బాబు, సెక్రటరీ దివి వేణుగోపాల్, ఇతర అధికారులు, బోర్డు సభ్యులు అభినందించారు. ఇదిలా ఉండగా రానున్న ఏడాది (2024-25) కర్ణాటకలో పంట ఉత్పత్తి పరిమాణాన్ని కూడా ఈ సమావేశంలో ఖరారు చేశారు. రెండేళ్లుగా కర్ణాటకలో 100 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుతిస్తుండగా వచ్చే ఏడాది కూడా అలాగే అనుమతి ఇస్తూ శుక్రవారం నాటి బోర్డు సమావేశంలో తీర్మానించింది.



వైసీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ను నిలదీస్తున్న ట్యాంకర్ల యజమానులు

నీళ్ల బిల్లులు చెల్లించండి

రోడ్డెక్కిన సర్పంచులు, ట్యాంకర్ల యజమానులు

వైసీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ను అడ్డుకున్న వైనం

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 16 : 'గ్రామాల్లో నాలుగేళ్ల నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశాం. జేబు గుళ్ల చేసుకొని ప్రజల గొంతు తడిపాం. మాకు బిల్లులు ఇప్పించండి మహాప్రభో' అంటూ వైసీపీ సర్పంచులు, ట్యాంకర్ల యజమానులు శుక్రవారం రోడ్డెక్కారు. ఎర్రగొండపాలెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద 20 నిమిషాలపాటు రాస్తారోకో చేశారు. దీంతో మార్కాపురం నుంచి మాచర్ల వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ట్యాంకర్ల యజమానుల సమన్వయకర్త రమణారెడ్డి మాట్లాడుతూ.. తమకు నాలుగేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలోనే బిల్లులు రాలేదన్నారు. దీంతో నీటిని సరఫరా చేయకలేక పోతున్నామని తెలిపారు. తమను గ్రామాల్లో జనమే కాదు పార్టీ కార్యకర్తలు కూడా విశ్వసించని పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మూడు నెలలకే బిల్లులు వచ్చేవని, తమ ప్రభుత్వంలో మాత్రం అసలు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ బిల్లులు రాకపోతే తాము ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆ దారిలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ వెళుతుండగా ఆయన్ను అడ్డుకున్నారు. తమ బిల్లులు ఎప్పుడు ఇప్పిస్తారో తేల్చాలని నిలదీశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వెంటనే బిల్లులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో వైసీపీ నాయకులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో పోలిరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, మానేపల్లి సర్పంచ్ జి.రమణారెడ్డి, కాశీరావు, నెమిలయ్య, యేర్వ ప్రతాప్‌రెడ్డి, కాశిరెడ్డి, వాదంపల్లి రాజయ్య, రంగారెడ్డి, నీళ్ళ ట్యాంకర్ల యజమానులు పాల్గొన్నారు.

కదిలించిన అడ్డంకులు

- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న టీడీపీ శ్రేణులు
- ఆ నాలుగు సెగ్మెంట్లలో భారీ కదలిక
- చంద్రబాబు ఇంకొల్లు సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారపార్టీ వేధింపులు, అక్రమ కేసులు, అవినీతి వ్యవహారాలతో విసిగి వేసారుతున్న ప్రజల అసంతృప్తికి ప్రభుత్వం మరింత ఆజ్యం పోసింది. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో కదలాలా.. వద్దా..! అనుకుంటున్న టీడీపీ శ్రేణుల్లోనూ పౌరుషాన్ని రగిలించింది. ఇందుకు చంద్రబాబు సభను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేసిన కుట్రలు, కుతంత్రాలే కారణమయ్యాయి. శనివారం ఇంకొల్లులో జరిగే రా.. కదలిరా.. సభకు బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఆయా ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు భారీగా కదిలొచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి ఆ సభకు పెద్దఎత్తున శ్రేణులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒకవైపు ఒకట్రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థులు దొరక్క, రెండుచోట్ల కొత్తవారిని రంగంలోకి దింపినా కుదుటపడని పరిస్థితులలో ఉన్న వైసీపీ నుంచి ఇటీవల వలసలు కూడా పెరిగాయి. ఈనేపథ్యంలో ఇంకొల్లులో జరిగే చంద్రబాబు సభను అడ్డుకునేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేసి విఫలం చెందింది. సభకు అడ్డంకులు కల్పించాలన్న ప్రభుత్వ ప్రయత్నమే టీడీపీ నేతల్లో పౌరుషాన్ని రగిలించింది.

అడ్డంకులతో ఇబ్బందులు

అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో రా..కదలిరా పేరుతో తెలుగుదేశం, జనసేనలు ఎన్నికల శంఖారావం సభలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా శనివారం ఇంకొల్లులో సభ జరగనుంది. దీని నిర్వహణలో కీలక పాత్రధారి అయిన ఎమ్మెల్యే బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావుకు తొలిరోజే నోటీసులిచ్చి భయాందోళనకు గురిచేసే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేసింది. అయినా వెనక్కు తగ్గకపోవడంతో సభా నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్న పొలం దేవదాయ శాఖకు చెందిందని, పనులను ఆపేయాలని ప్రయత్నించింది.



ఇంకొల్లులో చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి

అయితే భూమి దేవాదాయ శాఖకు చెందినప్పటికీ లీజుదారుడైన రైతు ముందుకొచ్చి అక్కడ సభ నిర్వహణకు తానే అనుమతించాను, దమ్ముంటే అరెస్టు చేసుకోండని సవాల్ చేయడంతో ప్రభుత్వ యంత్రాంగం వెనుకడుగు వేసింది. ఈ సభ నిర్వహణను అడ్డుకునేందుకు అధికారపార్టీ ప్రయత్నం చేయడంలో ప్రత్యేకత లేకపోలేదు. బాపట్ల లోక్‌సభ స్థానం టీడీపీకి పెట్టని కోట. గత ఎన్నికల్లోనూ ఈ లోక్‌సభ పరిధిలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలిచింది. పైగా ప్రస్తుతం పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు ఏలూరి, రవి, సత్యప్రసాద్‌లతోపాటు మాజీ మంత్రి ఆనంద్‌బాబు ఇతర నియోజకవర్గాలలోని నాయకులు రాజకీయంగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్‌ను ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నం చేశారు. అదే తరహా ప్రయత్నం ఎమ్మెల్యే ఏలూరి మీదా చేశారు. చీరాలలో గెలుపొందిన బలరాంను తమ పార్టీలోకి తీసుకున్నారు. అయినా బాపట్ల లోక్‌సభలో టీడీపీ కార్యక్రమాల నిర్వహణలో ఏమాత్రం తగ్గలేదు. మరో వైపు అధికార వైసీపీ పరిస్థితి చూస్తే అయోమయంగా తయారైంది. పర్చూరు నుంచి రంగంలోకి దించాలని జగన్ భావించిన ఆమంచి పలాయనం చిత్తగించాడు. ఇప్పటికీ అక్కడ అనుకున్న స్థాయి అభ్యర్థి దొరక్క వైసీపీ అధిష్ఠానం కుస్తీ పడుతోంది. అద్దంకి, ఎస్ఎన్ పాడులకు గుంటూరు జిల్లా నుంచి నాయకులను దిగుమతి చేశారు. చీరాలలో ఆమంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రేపల్లెలో మోపిదేవిని కాదని కొత్తవారికి అవకాశం ఇవ్వడంతో ఉన్న కాస్త పరిస్థితి దిగజారింది. వేమూరులోనూ మంత్రి నాగార్జునను మార్పు చేసి ఆ జిల్లాకు సంబంధం లేని ప్రకాశం జిల్లా వాసిని తీసుకెళ్లి రంగంలోకి దింపారు. ఇన్ని చిత్రవిచిత్ర వ్యవహారాలకు వైసీపీ పాల్పడగా కిందిస్థాయిలో శ్రేణులు, నాయకత్వం పోలోమని టీడీపీలోకి వలసపోతున్నారు. అద్దంకిలో అయితే ఓటు బ్యాంకులుగా చెప్పుకోదగిన వైసీపీ నాయకుల్లో అత్యధిక భాగం టీడీపీలోకి క్యూకట్టారు. పర్చూరులోనూ వలసలపర్వం పెరిగింది. ఎస్ఎన్‌పాడు, చీరాలలో అంతర్గత కుమ్ములాటలు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మరింత బహిర్గతమయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

బాబు సభను అడ్డుకునేందుకు విఫలయత్నం

ఈ నేపథ్యంలో కీలకమైన పర్చూరు నియోజకవర్గంలో బాబు సభ జరిగి అది విజయవంతమైతే నష్టం అని అధికారపార్టీ భావించింది. అందుకే ఇంకొల్లు సభను అడ్డుకునే ప్రయత్నం చేసి విఫలమైంది. అయితే ఈ ప్రయత్నం టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహాన్ని రగిలించింది. ముమ్మరమైన వ్యవసాయ పనులతో ఉన్న రైతులు, కూలీలు తాజా పరిణామాలతో ఇంకొల్లు సభకు పెద్దఎత్తున తరలేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ నాయకులు ఆశించిన లక్షన్నర మంది వస్తారో లేదో కానీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచే లక్షమందికిపైగా హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమైంది. సభ జరిగే పర్చూరు నుంచి 50 వేలమంది హాజరయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

రెండో రోజూ కొనసాగిన ఆందోళన

మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగుల నిరసన

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 16 : ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లావ్యాప్తంగా రెండోరోజైన శుక్రవారం కూడా ఆందోళన కొనసాగించారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఒకచోటకు చేరి ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ కూచిపూడి శరత్‌బాబు నాయకత్వంలో స్థానిక రిమ్స్ వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇదే విధానాలను అవలంబిస్తే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని శరత్‌బాబు హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కొత్తపల్లి మంజేష్, శివకుమార్, వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, షరీఫ్, ప్రసన్న, కిషోర్, సునీల్, రోజ్‌కుమార్, మాధవి, కోటేశ్వరమ్మ, రత్నారాణి, విజయ, సాల్మన్‌రాజు, భాస్కర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులోని రిమ్స్ వద్ద నిరసన తెలుపుతున్న నర్సులు, ఉద్యోగులు

రోడ్డెక్కిన రైతులు, కార్మికులు

- మోదీ హటావో, దేశ్ బచావో అంటూ నినాదాలు
- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 16 : కేంద్రప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా రైతులు, కార్మికులు రోడ్డెక్కారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రైతులు, కార్మికులు మండిపడ్డారు. 'మోదీ హటావో, దేశ్ బచావో' అని నినదించారు. ఒంగోలులో స్థానిక కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్, బాపూజీ కాంప్లెక్స్, పాత కూరగాయల మార్కెట్ సెంటర్, ట్రంకురోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో కార్మిక సంఘాలు, వామపక్ష నాయకులు మాట్లాడుతూ మూడు నల్లచట్టాల ఉపసంహరణ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. అదానీ, అంబానీలాంటి కార్పొరేట్ శక్తులను ప్రపంచ కుబేరులుగా మార్చడమే లక్ష్యంగా పాలనను సాగిస్తున్నారని విమర్శించారు. మూడేళ్ల క్రితం ఢిల్లీలో రైతుసంఘాల ఆధ్వర్యంలో 13నెలలపాటు సాగిన ఉద్యమం చారిత్రాత్మకమైనదన్నారు. ఈ ఉద్యమంలో 700మంది రైతులు మృతిచెందారన్నారు. దీంతో ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పి వ్యవసాయ నల్లచట్టాలను రద్దుచేశారన్నారు. కానీ వాటి అమలు విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, డీవీఎన్.స్వామి, చిట్టిపాటి వెంకట్రావు, పెంట్యాల హనుమంతరావు, ఉప్పుటూరి ప్రకాశరావు, లలితకుమారి, చావలి సుధాకరరావు, దాసరి సుందరం, బి.పద్మ, జార్జి, రాజేశ్వరరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, టి.మహేష్, జి.రమేష్ సుబ్బారావు, పీవీఆర్ చౌదరి, జి.శ్రీనివాసులు, ఆర్.మోహన్, ఎంఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులోని ప్రకాశం భవన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

అంకెల గారడీగా కార్పొరేషన్ బడ్జెట్

ఆదాయం రూ.191.35 కోట్లు.. వ్యయం 181.06 కోట్లు..

పొంతనలేని 2024-25 బడ్జెట్‌పై టీడీపీ కార్పొరేటర్లు నిలదీత

సమావేశంలో వైసీపీ కార్పొరేటర్ల ఓవరాక్షన్

అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 16 : ఒంగోలు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ అంకెల గారడీగా కనిపించింది. ఆదాయంపై అంచనాలు, ఖర్చులు, మిగులదల పరిశీలిస్తే పొంతనలేకుండా పోయింది. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ బడ్జెట్‌పై నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బడ్జెట్‌పై చర్చ జరిగింది. అటు ప్రతిపక్ష టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. 2023-24 ఏడాదికి సంబంధించి సవరించిన బడ్జెట్‌తోపాటు 2024-25 బడ్జెట్ అంచనాలపై పాలకవర్గం సమావేశంలో చర్చించారు. గత ఏడాది వార్షిక బడ్జెట్‌లో రూ.38 కోట్లు నిల్వ చూపగా, ఈ ఏడాదికి సంబంధించి రూ.191.35 కోట్లు ఆదాయం అంచనాగా రూపొందించారు. అలాగే వాటిలో రూ.181.71 ఖర్చులు చూపగా, రూ.10కోట్లు మాత్రమే నిల్వగా చూపారు. దీంతో ఒకరిద్దరు వైసీపీ కార్పొరేటర్లు, ఇటు టీడీపీ కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీనిపై సమాధానం ఇవ్వాలని వారు అధికారులను ప్రశ్నించారు.



టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

వాస్తవానికి విరుద్ధమైన బడ్జెట్ - టీడీపీ కార్పొరేటర్లు

బడ్జెట్‌పై టీడీపీ కార్పొరేటర్లు తీవ్ర అభ్యంతరం చేశారు. గత ఏడాదికి, ఈ ఏడాదికి తేడాలను తెలియజేస్తూ కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య బడ్జెట్ కేవలం అంకెల గారడీగా ఉందన్నారు. ఆయన మాట్లాడుతుండగానే అధికార వైసీపీ కార్పొరేటర్లు అంబటి ప్రసాద్, ఆదిపూడి గిరిజా శాండిల్యా సభ మర్యాదను విస్మరించి మాట్లాడటం వాగ్వాదానికి దారి తీసింది సభాధ్యక్షురాలి అనుమతితోనే దాచర్ల వాస్తవ పరిస్థితిని వివరించే ప్రయత్నం చేశారు. రాబడి, ఖర్చులు, ఇతర ప్రభుత్వ నిధులు తదితరాలు కలుపుకుని అధికారులు వేసి బడ్జెట్ సరిగా లేదని ఆయన చర్చకు తీసుకువచ్చారు. అయితే ఆయన తెలిపిన అభ్యంతరాలపై అటు అధికారులు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేయక పోగా, వైసీపీ కార్పొరేటర్లు అడ్డుపడి సమావేశాన్ని గందరగోళం చేశారు. దీనిపై రమణయ్య మాట్లాడుతూ ఇది సభా మర్యాద కాదని, ఒక సభ్యుడు తన అభిప్రాయాన్ని, వాస్తవాన్ని వివరించే క్రమంలో ఉద్దేశ్యపూర్వకంగా గొడవ చేయడం సరికాదన్నారు. ఆదాయం, ఖర్చులు అన్నీ కూడా పొంతన లేవని చెప్పారు. వైసీపీ కార్పొరేటర్ల తీరును తప్పుపట్టారు. అదేవిధంగా వైసీపీకి చెందిన కార్పొరేటర్ ఈదర వెంకటసురేష్ బాబు బడ్జెట్‌పై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. గత ఏడాది బడ్జెట్‌కు, ఈ ఏడాది బడ్జెట్‌కు ఏమాత్రం పొంతన లేదని, అందుకు గల కారణాలు వివరించాలని కోరారు.

వైసీపీ కార్పొరేటర్ల గందరగోళం

టీడీపీ కార్పొరేటర్ రమణయ్య తన వాదనను వినిపించకుండానే వైసీపీ కార్పొరేట్లు తీవ్రస్థాయిలో గందరగోళం సృష్టించారు. "43 మంది సభ్యులు ఉన్నాము. మీరెంత? ఏడుగురు ఉన్నారు. మీరు చెప్పింది వినాలా? బడ్జెట్‌పై అజెండా ఆమోదించాం. ముందు బయటకు వెళ్ళండి" అని మాట్లాడటంతో సభలో గందరగోళం మొదలైంది. దీంతో వైసీపీ చేసిన వాఖ్యలపై టీడీపీకి చెందిన తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ కార్పొరేటర్ల వ్యవహార శైలిని తప్పు పట్టారు. దీంతో కార్పొరేటర్ల మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అనుకునే స్థాయికి వచ్చింది. అయితే వైసీపీ కార్పొరేటర్లు ముందస్తు ప్రణాళిక ప్రకారమే టీడీపీ కార్పొరేటర్ల నోరు నొక్కే ప్రయత్నం చేశారు. దీంతో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు జోక్యం చేసుకుని బడ్జెట్ అంచనాలను వివరించే ప్రయత్నం చేశారు.

సినిమా చూస్తున్నారా.. - మేయర్

ఈఏడాది వార్షిక బడ్జెట్‌పై జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో జరిగిన చర్చపై అటు టీడీపీ, ఇటు వైసీపీకి చెందిన ఒకరిద్దరు కార్పొరేటర్లు అభ్యంతరం తెలియజేయగా, కార్యాలయ అకౌంట్ ఆఫీసర్ మౌలాలి మౌనంగా ఉండటంపై మేయర్ సుజాత సీరియస్ అయ్యారు. ఏం సినిమా చూస్తున్నారా.. అడిగిన దానికి సమాధానం చెప్పండి అంటూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో టీడీపీ కార్పొరేటర్లు దాచర్ల రమణయ్య, తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీను, సంద్రపాటి వర్ష్‌వర్ష్, వేమూరి అశ్విని, మస్తానమ్మ, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, డిప్యూటీ మేయర్‌లు వెలనాటి మాధవరావు, వేమూరి బుజ్జి, కమిషనరు జశ్వంత్‌రావు, ఎంఈ జానీబాషా, ఏసీపీ కె.వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా

• ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఇళ్ల స్థలాల కోసం అవసరమైన భూముల గల రైతుల వద్ద తాను ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలనే దృక్పథంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా సీఎం జగన్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. శుక్రవారం అగ్రహారం వద్ద ఇళ్ల స్థలాలను పరిశీలించిన అనంతరం విలేఖరుల సమావేశంలో బాలినేని మాట్లాడారు. అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చేందుకు అధికారులు పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని, భూముల ఎంపికలో కూడా అధికారులే కీలకపాత్ర పోషించిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు. భూసేకరణ ప్రక్రియ మొత్తం అధికారుల మీదనే వదిలిపెట్టానని, భూమి కొనుగోలు చేసిన తర్వాత రైతుల అకౌంట్లలో నిధులు జమ అనంతరమే ఆయా భూములను పరిశీలించి ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తాను రాజకీయాల్లో ఉండటం అంత ఇబ్బందిగా ఉందని చెప్పితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు. ఇంటా, బయటా ఇలాంటి వారి వల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతమంది ఎన్ని కుట్రలు పన్నినా ఇచ్చిన మాట ప్రకారం పేదలకు పట్టాలు ఇస్తామని స్పష్టం చేశారు.

ఇదేం అత్యుత్సాహం..!

నడిరోడ్డుపై శిలాఫలకం ఏర్పాటు

కార్పొరేషన్ అధికారుల తీరుపై విమర్శలు



నడిరోడ్డులో ఏర్పాటు చేసిన శిలాఫలకం

ఒంగోలు నగరపాలక సంస్థ అధికారుల అత్యుత్సాహం శృతిమించుతోంది. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవ శిలాఫలకాల నిర్మాణంలో నిబంధనలు సైతం మర్చిపోయారు. నగరంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి త్వరలోనే ప్రారంభోత్సవాలు చేయనుండగా, అందుకు అనుగుణంగా కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. అందులో భాగంగానే స్థానిక రంగారాయుడు చెరువు ఎదురుగా నడిరోడ్డుపై శిలాఫలకం ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. నిత్యం వేలాదిమంది వాహనదారులు ఆవైపు రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణ రోజుల్లోనే ట్రాఫిక్ సమస్య కనిపిస్తుండగా, నడిరోడ్డులో శిలాఫలకం నిర్మించడంపై జనం అవాక్కవుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య పెరగడంతో పాటు వాహన ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు(కార్పొరేషన్)

రేపు ఒంగోలులో రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఒంగోలులోని బాపూజీ కాంప్లెక్స్ ఎదుట ఏర్పాటు చేసిన దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య కాంశ్య విగ్రహం ఆదివారం సాయంత్రం ఆవిష్కరిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. స్థానిక వైశ్యభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రావు, కుప్పం ప్రసాద్, తాతా బదిరీలు మాట్లాడారు. రాష్ట్రంలో మొదటిసారిగా రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో నగరంలో ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు ఆశాజ్యోతి అయిన కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఆర్థికశాఖమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా ప్రజాసేవ చేశారని చెప్పారు. విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే బాలినేని, డిప్యూటీ సీఎం వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, అన్నారాంబాబు, మాజీమంత్రి శిద్దా రాఘవరావు, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్, పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ విగ్రహావిష్కరణలో జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్యులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జలదంకి కృష్ణారావు, చెంచురామారావు, కోడూరి కిషోర్, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

ఒంగోలు(కలెక్టరేట్), ఫి బ్రవరి 16: ఒంగోలు నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్ల కు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిష న్(ఈవీఎం)ల పనితీరు విధానంపై ఒంగోలు ఇన్‌చార్జి ఆర్డీవో లోకేశ్వరరావు అవగాహన కల్పించారు. శుక్రవారం ఒంగోలులోని ఆర్డీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ సుజన్‌కుమార్, రూరల్ తహసీల్దార్ డానియేలు, ఎన్నికల డీటీ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవీఎంల పనితీరుపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని లోకేశ్వరరావు సూచించారు.

20న ఒంగోలుకు సీఎం జగన్ రాక

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ • అధికారులతో సమీక్ష • అగ్రహారంలో స్థలాల లేఅవుట్ పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఒంగోలు నగరంలోని అర్హులైన పేదలకు ఈనెల 20వతేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు, పట్టాల పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఎన్.అగ్రహారంలోని లేఅవుట్‌లో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించడంతో పాటు పట్టాల పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన లేఅవుట్ మ్యాపులను పరిశీలించారు. సంబంధితశాఖల అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఒంగోలులోని పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు ఈనెల 20న సీఎం వస్తున్నారని తెలిపారు. పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన భూ సేకరణకు, లే అవుట్‌లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.231కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎన్.అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కలపాలెం, యరజర్లలో 540 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 460 ఎకరాలు భూసేకరణ చేసినట్లు తెలిపారు. మరో 60 ఎకరాలను భూసేకరణ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. లే అవుట్‌లో పట్టాలు పంపిణీ చేసేందుకు ప్లాట్ల ఏర్పాటుతో పాటు రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూడా చర్యలు తీసుకున్నామన్నారు. 22వేల మందికి పట్టాలు పంపిణీతో పాటు 15వేల మందికి హౌసింగ్ మంజూరు పత్రాలను కూడా సీఎం చేతుల మీదుగా అందిస్తారని పేర్కొన్నారు. అనంతరం సభా వేదిక, హెలిప్యాడ్ ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాలు, సీఎం కాన్వాయ్ రూటు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సీఎం పర్యటనకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



లేఅవుట్ మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే బాలినేని, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

సీఎం భద్రత ఏర్పాట్లపై పరిశీలన

ఒంగోలు(క్రైం): ముఖ్యమంత్రి జగన్ ఈనెల 20న ఒంగోలు పర్యటనకు వస్తుండడంతో అధికార యంత్రాగం అప్రమత్తమైంది. దీంతో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నగరంలోని ఎన్.అగ్రహారం, వెంగముక్కపాలెం గ్రామాల్లో ఇళ్ళ స్థలాలు పంపిణీ కార్యక్రమానికి సీఎం హాజరుకానుండడంతో సభావేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ తదితర ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. ఇంకా సీఎం పర్యటించే మార్గంలో తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ కిషోర్‌బాబు, ఎస్బీ డీఎస్పీ ఎ.రామచంద్ర, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీపాడు వైసీపీలో బదిలీల చిచ్చు!

మంత్రి నాగార్జున ఏకపక్ష నిర్ణయాలపై అసహనం • అధికారుల బదిలీల రద్దుకు డిమాండ్ • మద్దిరాలపాడులో మండల నాయకుల భేటీ

నాగులుప్పలపాడు(రూరల్), ఫిబ్రవరి 16: నాగులుప్పలపాడు మండల వైసీపీలో అధికారుల బదిలీల చిచ్చు రేగింది. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులకు ఎలాంటి సమాచారం లేకుండానే గ్రామ పంచాయతీ కార్యదర్శిని, అలాగే వెలుగుశాఖలో ఏపీఎంను బదిలీ చేశారు. అంతేగాకుండా ఈనెల 14న మండల పరిషత్ కార్యాయం వద్ద జరిగిన వలంటీర్ల సమావేశానికి కూడా మండలంలోని నాయకులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి మేరుగ నాగార్జునపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. కాగా మద్దిరాలపాడులోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి మండలంలోని పలువురు నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈదుమూడి, ఒమ్మెవరం, ఎం.ముప్పాళ్ల గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శిని, వెలుగు ఏపీఎంను తమకు ఎలాంటి సమాచారం లేకుండా బదిలీ చేశారని విమర్శించారు. వలంటీర్లతో మంత్రి పరిచయ కార్యక్రమాలకు కూడా తమకు సమాచారం ఇవ్వకపోవడం తగదన్నారు. మంత్రి ఏకపక్ష నిర్ణయాలను తప్పు పట్టారు. ఈనెల 17వ తేదీ నుంచి మండలంలోని పలు గ్రామాల్లో ప్రారంభోత్సవాలు, వివిధ కార్యక్రమాలకు షెడ్యూలు ప్రకటించారని, అయితే తమకు తెలియకుండా జరిగిన బదిలీలు రద్దు చేసే వరకు తాము పాల్గొనబోమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, మద్దిపాడు ఏఎంసీ ఛైర్మన్ మారెళ్ల బంగారుబాబు, నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఢాకా రమణారెడ్డి, పరంధామరెడ్డి, వైకుంఠ వీరాంజనేయులు, కొమ్మూరి సుధాకర్, యాత్రా దశరథరామయ్య, పెనుబోతు రంగారావు, బత్తుల ప్రసన్న, గూడూరు రాంబాబు, కూనం పూర్ణయ్య, కొయి హనుమయ్య, ఉప్పుగుండూరు శ్రీనివాసప్రసాద్, మాదాసు రాంబాబు, కొలకలూరి విజయ్, వెంకట్, యోహాను, నాని, చిన్న, కాట్రగడ్డ శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వైభవంగా రథసప్తమి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్నచెన్నకేశవ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై ఊరేగించారు. అంతకు ముందు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారి సొంత నిధులతో తయారు చేసిన రథానికి పూజలు చేసి ఆలయానికి అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఈదుపల్లి గురునాథం, ఈవో రజనికుమారి, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, కుప్పా రంగసాయి, పసుపులేటి శ్రీనివాసరావు, బెతంశెట్టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు(కలెక్టరేట్): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో రథసప్తమి సందర్భంగా పతంజలి యోగాపీఠ్ రాష్ట్ర అధ్యక్షుడు బాలుజీ ఆధ్వర్యంలో విద్యార్థులతో సామూహిక సూర్య నమస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.సంతప్‌కుమార్, ఎ.వెంకటరావు, యోగా శిక్షకులు ఇంద్రజ్యోతి, టి.శ్రీనివాస్, పూర్ణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





ఒంగోలు నగరంలో స్వామివార్ల ఊరేగింపు, పాల్గొన్న భక్తులు

- చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి డిగ్రీ కాలేజీలో పతంజలి యోగపీఠ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో బాలుజీ యోగాచార్య సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బోయపాటి రవి, వలివేటి సుధీర్, దేసు వెంకయ్య, ఎం.రామారావు, కిలారి రవి, కాలేజీ డైరెక్టర్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో ..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): ఉప్పుగుండూరులోని శ్రీవేణుగోపాల స్వామిదేవాలయంలో శుక్రవారం రథసప్తమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీధర్‌బాబు గ్రామస్థులతో సూర్యనమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు అధ్యక్షుడు పెంట్యాల శ్రీనివాస్, సర్పంచ్ దేవరకొండ జయమ్మ పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో సూర్యనమస్కారాలు



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి16: చదలవాడ గ్రామంలో ఎస్సీకాలనీలో తాగునీరు సరఫ రా లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, అయినా అధికారులు, పాలకులు ఎవ రూ పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ శివకృష్ణ విమర్శించారు. శుక్రవారం గ్రామసచివాలయం వద్ద ఎస్సీకాలనీవాసులతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ గ్రామ శివారులో ఉన్న యానాదులకు తాగునీరు సరఫరా లేకపోవడంతో అవస్థ పడుతున్నారని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేపు టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 16 : మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించేలా వారిలో స్ఫూర్తిని నింపేందుకు విజయీభవ పేరుతో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అపుస్మా జిల్లా అధ్యక్షుడు మాధవరావు తెలిపారు. ఒంగోలులోని వీఎన్‌జీ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎ1 కన్వెన్షన్‌హాలులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ప్రముఖ మనస్తత్వశాస్త్రవేత్త అభిషేక్ శింగంశెట్టి, డాక్టర్ రవిచంద్ర, రాము పులి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, మురళీకృష్ణ, నేతాజీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో సూర్యప్రభ వాహనసేవ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16 : ఒంగోలులోని కుర్తాళం శ్రీసిద్ధేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా శ్రీవారికి సూర్య ప్రభ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై విశేష అలంకరణలో కొలువు దీరిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. గోవింద నామ స్మరణంతో శ్రీగిరి పులకరించిపోయింది. అర్చకులు ఆదిత్య హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

• మంత్రి నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

సంతనూతలపాడు, ఫిబ్రవరి 16: సమస్యలు పరిష్కరించేలా అధికారులు నడుచుకోవాలని మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్యసమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వేసవికాలం సమీపిస్తున్నందున్న గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు చర్యలను తీసుకోవాలని తెలిపారు. మౌలికవసతులకు సంబంధించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 16: స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన ఏకే యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ జడ అరుణకుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉపాధి కోసం వెతుక్కోకుండా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, సీఎస్ఈ విభాగాధిపతి ఎస్.గిరిబాబు, డీన్ ఎలీయా, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి16: రైలు కింద పడి యువకుడు మృతి చెందిన ఈ సంఘటన శుక్రవారం ఒంగోలు నగరం రామ్‌నగర్ 3 వలైన్ ఎదురుగా ఉన్న రైల్వేట్రాక్‌పై జరిగింది. సుమారు 35 ఏళ్ళ వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. బులుగు, నలుపు రంగుల గల టీషర్టు, బూడిద రంగు ఫ్యాంట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు. అయితే సదరు యువకుడు రైలులో నుంచి జారిపడ్డాడా లేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది తెలియాల్సి ఉందని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మృతుడి వివరాలు తెలిసిన వారు 9440904870, 7013915467 సెల్‌నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

19న సెపకత్రా జట్లు ఎంపిక

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 16: జిల్లా సెపక్‌తక్రా ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన సాయంత్రం 4గంటలకు ఒంగోలులోని మినీస్టేడియంలో జిల్లాస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్లు ఎంపిక జరుగుతుందని సంఘ కార్యదర్శి డి.రవిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లు ఈనెల 24 నుంచి నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో జరిగే అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటాయని, వివరాలకు 6302262243సెల్‌నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యాధుల బారిన పడుతున్నా పట్టించుకోరా..?

• జనసేన పార్టీ ధ్వజం



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఒంగోలు నగరంలో ప్రజానీకం వ్యాధుల బారిన పడుతున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. స్థానిక కేశవస్వామిపేటలో జనసేన నాయకులు శుక్రవారం జనచైతన్య యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. దోమలు స్వైరవిహారంతో జనం వ్యాధుల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న ప్రజానీకం బాధలు మాత్రం మారడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు పసుపులేటి మురళీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముత్యాల కళ్యాణ్, బొందిల శ్రీదేవి, పల్ల ప్రమీల, గోవింద్ కోమలి, ఆకుపాటి ఉష, ఉంగరాల వాసు, కోట సుధీంరన్, వాసుకినాయుడు, మర్రిపూడి ఉదయ్, నరేష్, అనూష, మర్రిపూడి మాధవి, అవినాష్‌నాయుడు, కిరణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

రైతు, కార్మిక సంఘాల పిలుపు

ప్రశాంతంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి16: వ్యవసాయరంగాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, పారిశ్రామిక సంస్థలను కార్పొరేట్‌పరం చేస్తోందని రైతు సంఘం జిల్లా ప్రధాకార్యదర్శి వి.హనుమారెడ్డి ఆరోపించారు. ఒంగోలు మండలంలోని ఉలిచి, కరవది గ్రామాల్లో రైతు సంఘం నాయకులు గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కరవది బ్యాంక్ దగ్గర హనుమారెడ్డి మాట్లాడుతూ దేశంలోని అన్ని రంగాలను కేంద్రం కార్పొరేట్‌పరం చేస్తోందని ఆరోపించారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ నాయకుడు చుంచు శేషయ్య సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లెనిన్‌బాబు, నన్నపనేని వెంకట్రావు, యర్రంనేని నరసింహారావు, యర్రంనేని వెంకటశేషయ్య, చుంచు ఆదినారాయణ, ఉప్పలపాటి సుబ్బారావు, కల్పన, పోలవరపు సీతారామయ్య, కె.హనుమంతరావు, లింగా ఆంజనేయులు, జి.శాంసన్, కొల్లా హనుమంతరావు, రవి, కోటిరెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణమూర్తి, యు.కోటేశ్వరరావు, శేషయ్య పాల్గొన్నారు

ట్రాక్టర్ల ర్యాలీ



నాగులుప్పలపాడులో ర్యాలీ

నాగులుప్పలపాడు (ఒంగోలురూరల్): దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ బంద్ లో భాగంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంత్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నాగులుప్పలపాడులో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. స్కూళ్లు, బ్యాంకులను మూసివేయించారు. కార్యక్రమంలో టి.శ్రీకాంత్, మారెళ్ల వెంకట్రావు, జి.బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.మాబు అన్నారు. సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు శుక్రవారం సంతనూతలపాడులోని బంద్ నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, ఎ.వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు, నరసింహం, ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై వ్యక్తి అనుమానాస్పద మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సింగరాయకొండ, ఫిబ్రవరి 16 : రైల్వేస్టేషన్‌లోని ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై శుక్రవారం ఉదయం 40 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అతని కుడి కన్నుపై రక్త గాయం, నోటి నుంచి నురుగు బయటకు వచ్చి ఉంది. మృతుడు వంకాయరంగు నిండు చేతుల చొక్కా, కాఫీరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న ఒంగోలు జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సెల్ ఫోన్ నెంబర్‌లు : 94409 04870, 70139 15467ను సంప్రదించాలని జీఆర్పీ పోలీసులు కోరారు.

రేపు సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం, ఫిబ్రవరి 16 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ ఆర్గనైజేషన్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ జట్ల ఎంపిక కార్యక్రమంలో పాల్గొనే బాలబాలికల బరువు 55 కేజీలలోపు ఉండాలని, మార్చి 19, 2008 తర్వాత పుట్టిన వారై ఉండాలని, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 6301015775, 9966986373 నెంబర్లలో సంప్రదించాలని పుల్లయ్య కోరారు.

ఇళ్ల పట్టాలు అమ్ముకుంటున్నారు!

వైసీపీ నేత పుట్టాపై జనసేన పార్టీ నాయకుల ఆరోపణ

భారీ అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజం

విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్


నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

టంగుటూరు, ఫిబ్రవరి 16 : వైసీపీ నాయకుడు, ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ పుట్టా వెంకట్రావు టంగుటూరులోని పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీతోపాటు నాలుగు జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల స్థలాల మాటున భారీ అవినీతికి పాల్పడ్డారని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. ఈసందర్భంగా జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అండదండలతోనే పుట్టా అడ్డూఅదుపులేకుండా అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. వెంకట్రావు సర్పంచ్‌గా ఉన్న 2009 కాలంలో పోతుల వెస్ట్ కాలనీలో ఇళ్ల స్థలాల పంపిణీ జరిగిందని మనోజ్ తెలిపారు. అప్పట్లో లేఅవుట్‌లోని పట్టాల సంఖ్య 1,386 కాగా, సామాజిక అవసరాల నిమిత్తం 72 ప్లాట్లు వదిలి వేశారని గుర్తు చేశారు. ఈ 72 ప్లాట్లలో 62 ప్లాట్లు ఒక్కొక్కటి రూ.1.50లక్షలకు తన ఇష్టానుసారం పుట్టా అమ్ముకున్నారని మనోజ్ ఆరోపించారు. అప్పట్లో 20 మంది వివిధ శాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల స్థలాలు ఇచ్చారని వివరించారు. పోతుల వెస్ట్ కాలనీలో పుట్టా ఆధ్వర్యంలోనే పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని గుర్తించిన ప్రభుత్వం గతంలో ఆయనకు అరెస్ట్ వారెంట్ జారీ చేసినా ఇప్పటి వరకూ పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. 15 ఏళ్ల నాడు ఏర్పడ్డ పోతుల వెస్ట్ కాలనీలో ఇప్పటికీ మంచి ధర రాగానే పుట్టా ఇళ్ల స్థలాలు అమ్ముకుంటూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెస్ట్ కాలనీలో ఐటీసీ వారు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నుంచి 20 లీటర్‌ల క్యాన్ నీరు రూ.2కు ఇవ్వాల్సి ఉండగా ప్లాంట్‌ను తన స్వాధీనంలో ఉంచుకున్న పుట్టా క్యాన్ రూ.10 చొప్పున విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇదేప్లాంట్ నీటి ఆధారంగా బయట వ్యాపారం కూడా జోరుగా సాగిస్తున్నారని ఆక్షేపించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక వేసిన జగనన్న లేఅవుట్ కాలనీలకు భూ సేకరణలోనూ పుట్టా భారీ అవినీతిని పాల్పడ్డారన్నారు. ఎకరా రూ.3లక్షల నుంచి రూ.5లక్షల విలువ ఉన్న భూములను రూ.25లక్షలకు కొనుగోలు చేసిన వ్యవహారంలోనూ ఆయన భాగస్వామి అని ఆరోపించారు. పిచ్చిగుంట్ల వారి పేరున పంచిన ఇళ్ల పట్టాల్లో పుట్టా, ముస్లింలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల్లో అలెగ్జాండర్ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. సగానికి పైగా ఇళ్ల స్థలాలు వీరి సొంతానికి ఉంచుకొని అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. వీటిపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకునే వరకూ ఆందోళన కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీలను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ డీటీని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఆరోపణలను ఖండించిన పుట్టా

టంగుటూరులోని పోతుల వెస్ట్ కాలనీ, జగనన్న లేఅవుట్లలో అవినీతికి పాల్పడినట్లు జనసేన నాయకులు తనపై చేసిన ఆరోపణలను ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్, మాజీ సర్పంచ్ పుట్టా వెంకట్రావు ఖండించారు. జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి మనోజ్‌కుమార్ పదవిని అడ్డంపెట్టుకొని ప్యాకేజీలు పొందుతూ తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసీపీకి, వ్యక్తిగతంగా తనకు నష్టం కలిగేలా నిందారోపణలు చేస్తున్న మనోజ్‌పై పోలీసు కేసుకు సిఫార్సు చేయాలని తహసీల్దార్ కార్యాలయ డీటీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే ఎస్పైకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పుట్టా తెలిపారు.

శింగరకొండలో రథసప్తమి పూజలు

అద్దంకి, జనవరి 16: రథసప్తమి సందర్భంగా శింగరకొండలో శుక్రవారం సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో సుభద్ర, పూజారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని పలు దేవాలయాలలో కూడా పూజలు నిర్వహించారు.

సింగరాయకొండలో మారనున్న సమీకరణలు

దొద్దా, ఆయన అనుచరులను

టీడీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే స్వామి

సానుకూలంగా స్పందించిన కరుణాకర్‌రెడ్డి


దొద్దా కరుణాకర్‌రెడ్డి, వారి అనుచరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఫిబ్రవరి 16 : మండలంలో రాజకీయ సమీకరణలు మారనున్నాయి. వైసీపీ కీలక నేత, గత కొంతకాలంగా ఆపార్టీకి దూరంగా ఉంటున్న దొద్దా కరుణాకర్‌రెడ్డితో ఆయన నివాసంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే స్వామి సమావేశమయ్యారు. దొద్దాతోపాటు కుమారుడైన యువనేత మహీధర్‌రెడ్డి, వారి అనుచరులను తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు కూడా టీడీపీలో చేరేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనియర్ శాసనసభ్యుడు, మాజీ మంత్రి మహీధర్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడైన కరుణాకర్‌రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమైంది. దీంతో స్థానికంగా అధికార పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగలనుంది. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి అయిన మంత్రి సురేష్ కీలకనాయకులతో మాట్లాడించి కరుణాకర్‌రెడ్డి పార్టీలోనే ఉండేలా ప్రయత్నించి విఫలమయ్యారని తెలుస్తోంది. వైసీపీలో కష్టపడి పనిచేసిన వారికి కాకుండా ఓట్లు లేని నాయకులకు పెద్దపీట వేస్తున్నారని, వారిచేతే ఎన్నికల్లో పనిచేయించుకోవాలని సురేష్‌కు తన అభిప్రాయాన్ని కరుణాకర్‌రెడ్డి చెప్పి పంపినట్లు సమాచారం. నియోజకవర్గంలో పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే సింగరాయకొండ మండలంలో చోటుచేసుకుంటున్న ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే మున్ముందు రాజకీయ సమీకరణల్లో భారీ మార్పులు ఖాయమని తేలిపోతోంది. వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న వలసలపర్వం మరింత జోరందుకోంటుందన్న చర్చ నడుస్తోంది.

అండగా ఉండండి.. మంచి బహుమతులిస్తా

వలంటీర్లతో సమావేశంలో మంత్రి సురేష్

ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేత

సీఎం మిమ్మల్నే నమ్ముకున్నారన్న నాయకులు


మాట్లాడుతున్న మంత్రి సురేష్

కొండపి, ఫిబ్రవరి 16 : గ్రామ వలంటీర్లు తనకు అండగా ఉండాలని, త్వరలోనే మంచి బహుమతులు ఇస్తానని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయాల ఆవరణలో కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల వలంటీర్లతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండపిలో తనను గెలిపించి జగన్‌కు కానుకగా ఇవ్వాలని సురేష్ విజ్ఞప్తి చేశారు. ఉన్నత చదువులు చదువుకున్న వారు కూడా వలంటీర్లుగా పనిచేస్తుంటే ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయన్నారు. వలంటీర్లకు అర్హత పదో తరగతి కాగా, ఇప్పుడు పనిచేస్తున్న వారిలో 13 శాతం మందే ఆ అర్హత ఉన్నవారన్నారు. 85శాతం మంది డిగ్రీ, ఆపై చదువుల వారు, రెండు శాతం మంది డిప్లమో చేసిన వారు వలంటీర్లుగా సేవలందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1,595 మంది వలంటీర్లు పనిచేస్తుంటే 1,499 మందికి సేవామిత్ర, 30 మందికి సేవారత్న, ఐదుగురికి సేవా వజ్ర అవార్డులు వచ్చాయని మంత్రి తెలిపారు. వైసీపీ రాష్ట్ర నాయకుడు ఢాకా పిచ్చిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. వలంటీర్లు సురేష్‌కు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. సీఎం జగన్ కూడా మిమ్మల్నే నమ్ముకున్నారన్నారు. అనంతరం సేవా వజ్ర, సేవారత్న పొందిన వలంటీర్లకు మంత్రి శాలువాలు కప్పి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, పొన్నలూరు ఎంపీపీ మాధవ, జడ్పీటీసీ సభ్యుడు బెజవాడ వెంకటేశ్వర్లు, వైసీపీ మూడు మండలాల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, పెదకండ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణతోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరపై చట్టం చేయాలి


టంగుటూరులో బ్యాంకును మూసివేయించిన కార్మిక సంఘాల నాయకులు


కొండపిలో ధర్నా చేస్తున్న రైతు సంఘ నేతలు

టంగుటూరు, ఫిబ్రవరి 16 : వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ దానిపై చట్టం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె చేపట్టారు. నాయకులు ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి కొండపి రోడ్డులోని స్టేట్ బ్యాంకు వరకూ ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని పాఠశాలలతోపాటు, బ్యాంకులను మూసివేయించారు. ఈసందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ మార్గంలో పయనిస్తున్నాయన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించిక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యంచూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వి.మోజెస్, ఏఐటీయూసీ నేత టి.ప్రభాకర్, భాస్కర్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బొడ్డు సతీస్, కార్మిక సంఘాల నాయకులు పేరాబత్తిన శ్రీను, కె.శ్రీనివాస్, ఎం.యానాది, ఐఎఫ్‌టీయూ నాయకులు టి.వెంకట్రావు, సిహెచ్.రంగారావు, సిహెచ్.తిరుమల, రైతు కూలీ సంఘం నాయకుడు గుళ్లపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : మోదీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గ్రామీణ బంద్ విజయవంతమైంది. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లను కార్మిక సంఘాల నాయకులు మూసివేయించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లను ప్రోత్సహిస్తూ, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘాల నాయకులు వై.చంద్రశేఖర్, నాగరాజు, సీపీఐ కార్యదర్శి ఆర్.లక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి జి.వందనం, నాయకుడు వై.రూబెన్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల ఉసురుతో జగన్‌రెడ్డి పతనం ఖాయం

ఓటమి భయంతో వైసీపీ విపరీత పోకడలు

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 16: అమరావతి రైతుల కన్నీటి ఉసురుతో జగన్‌రెడ్డి పతనం ఖాయమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ విపరీత పోకడలకు తెరలేపిందని ఆయన ధ్వజమెత్తారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదలచేశారు. రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్ధలయ్యాయన్నారు. రాజధాని విషయంలో జగన్ చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపించారన్నారు. ఒక పాలకుడి కుట్రలతో ప్రజారాజధాని ఎలా విధ్వంసం అయిందో చూపించారన్నారు. వేల కోట్ల ప్రభుత్వ సంపద ను ఎలా నాశనం చేశారో, రైతులు, మహిళల పట్ల ఎంత దారుణంగా వ్యవహరించారో అనే నిజాలు ఈ సినిమా ద్వారా ప్రజలలోకి వెళతాయనే భయంతో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అడుగడుగునా సినిమాను అడ్డుకునేందుకు అన్ని రకాల కుట్రలు చేశారన్నారు. సినిమాలో పెద్ద నటులు నటించకుండా అడ్డుకున్నారన్నారు. గతంలో మూడు రాజధానుల విషయంలో ఎం జరిగిందో చూశామని, ఇప్పుడు రాజధాని సినిమా విషయంలోనూ అదే చేస్తున్నారన్నారు. సీఎం వందల కోట్లు పెట్టి ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం చేయటం అనేది అమరావతి విషయంలో చూశామన్నారు. జగన్‌రెడ్డి అమరావతి విధ్వంసం వల్ల రాష్ట్రం లక్షల కోట్ల సంపద నష్టపోయింది వాస్తవం కాదా అని ఎమ్మెల్యే రవికుమార్ ప్రశ్నించారు. జగన్ సినిమా అయిపోయిందన్నారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో వైసీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని ప్రజలకు చూపే రాజధాని ఫైల్స్ సినిమా మళ్ళీ మొదలైందని ఎమ్మెల్యే అన్నారు.

తెలుగుజాతి కీర్తి పతాక శ్రీకృష్ణదేవరాయలు


నివాళులర్పిస్తున్న కవులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16 : దేశబాషలందు తెలుగు లెస్స అని ఎలుగెత్తి చాటిన మహాతేజో విరాజం శ్రీకృష్ణ దేవరాయలు అని, ఆయన స్ఫూర్తితో మనమందరం తెలుగు భాషాభివృద్ధికి పునరంకితం కావాలని సాహితీలోకం పిలుపునిచ్చింది. శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని రంగారాయుడు చెరువు కట్ట వద్ద ఆయన విగ్రహం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ 500 ఏళ్ల నాడే తెలుగు భాషకు, తెలుగు జాతికి, తెలుగు నేలకు విశేషమైన ఖ్యాతిని కల్పించిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. రాయలవారిని స్మరించుకోవాల్సిన బాధ్యత తెలుగు జాతిపై ఉందన్నారు. సంగీతం, సాహిత్య చిత్రలేఖనం, నాట్యం, శిల్పం వంటి లలిత కళలకు కృష్ణరాయల పరిపాలనాయుగం స్వర్ణయుగం లాంటిదన్నారు. నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతతూ ఓటమి ఎరుగని చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు సాహితీరంగానికి విశేష కృషి చేశారని చెప్పారు. నాటి వైభవాన్ని ప్రస్తుత తరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నరసం గౌరవాధ్యక్షురాలు అరుణ, రాయలవిగ్రహ ప్రతిష్ఠాపకులు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ, మిడసల మల్లికార్జునరావు, యూవీ.రత్నం, అనుమల మహేంద్రకుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 16: వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పార్వతీపురంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం పంచవటి రామలింగేశ్వర స్వామి శివశక్తి పీఠం క్షేత్రం 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బట్టా అనంత లక్ష్మి, లీలానంద ప్రసాద్, దంతం వెంకట సుబ్బారావు, చంద్రమోహన్, మంతు, బండికళ్ల నరేష్, షేక్ కజ్జిబాబు, యారాసు శ్యామ్, లేళ్ల భాస్కరరావు, అందే కృష్ణ, ఖాదర్ పాల్గొన్నారు.

పట్టా ఫైట్!

కోర్టుకెళ్లింది సొంత పార్టీ వారే

బయటి వారేనంటూ బాలినేని చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు లేవు

సీఎం హడావుడి రాకలో ఎన్నికల వ్యవహారమే కీలకం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ఒంగోలులో పేదలకు పెద్దసంఖ్యలో నివాసస్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే ఇంటాబయట సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించేవారు ఎవరో కూడా అర్థంకావటం లేదు. హైకోర్టులో పిల్ వేసిన వారు ఎవరనేదీ అర్థంకావటం లేదు' అని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. పరిస్థితిని పైనుంచి చూసే వారికి అది నిజమే కదా అని అనిపిస్తుంది. కానీ లోతుగా అధ్యయనం చేస్తే అందులో అర్థం కాని పరిస్థితి ఏమీ లేదనే విషయం తేటతెల్లమవుతుంది. వెనువెంటనే పేదలకు పట్టాలు ఇవ్వాలన్న ఆతృతతో పనిచేస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంలో అక్రమాలు ఉన్నాయంటూ మున్సిపల్ మాజీ మాజీ వైస్ ఛైర్మన్, వైసీపీ నేత సింగరాజు రాంబాబు హైకోర్టులో పిల్ వేసిన మాట నిజం. అయితే ఈ నేపథ్యంలో శుక్రవారం బాలినేని ఒంగోలులో మీడియాతో మాట్లాడుతూ ఇంటాబయటా ఎదురవుతున్న సమస్యలతో అల్లాడిపోతున్నాను. ఎవరు చేస్తున్నారో అర్థం కావటం లేదంటూ పట్టాల పంపిణీ విషయంలో హైకోర్టులో పిల్ వేసిన అంశంపై వ్యాఖ్యలు చేశారు. కానీ పరిశీలించి చూస్తే అందులో శోధించాల్సిన అంశం ఏమీ లేదు. హైకోర్టులో పిల్ వేసింది సింగరాజు రాంబాబు. ఆయన గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి బాలినేనికి మద్దతుగా పనిచేశారు. ఆ తర్వాత చాలాకాలం ఆయనతోనే ఉన్నారు. కారణాలేమైనప్పటికీ విభేదించిన తర్వాత అదే పార్టీలో ఉంటూ టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పక్కన చేరారు. సొంత బావ బావమరుదులు అయినప్పటికీ బాలినేనికి వైవీకి మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. బాలినేనితో విభేదించిన రాంబాబు ఆయా సందర్భాలలో వైవీకి మద్దతుగా నిలబడ్డాడు. ఇది బహిరంగంగా ఆ పార్టీశ్రేణులతోపాటు ఒంగోలులోని రాజకీయ నాయకులందరికీ తెలిసిన నగ్నసత్యం. పైగా సొంత కుటుంబం వారైనా ద్వేషిస్తే తిరిగి దగ్గరకు రానివ్వడు అనే నానుడి టీడీపీ నేత దామచర్ల జనార్దన్‌పై ఉంది. ఆయనకు కానీ టీడీపీ శ్రేణులకు కానీ రాంబాబు దగ్గరవుతున్న దాఖలాలు ఇంతవరకు కనిపించలేదు. ఈ నేపథ్యంలో బాలినేని భావించినట్లు ఇంటి సమస్యే తనను వెంటాడుతుందన్న విషయం తేటతెల్లమవుతోంది. అందులో ప్రధానమైన ఈ సమస్యను ఆయన పార్టీపరంగా పరిష్కరించుకోవాలే తప్ప మరో సాకు చూపే అవకాశం కనిపించటం లేదు. అయితే న్యాయనిపుణుల అభిప్రాయాల మేరకు రాంబాబు హైకోర్టులో వేసిన పిల్‌లోని అంశాలు నివాసస్థల పట్టాల పంపిణీకి అడ్డంకాబోవని అర్థమవుతోంది. ఈ సమస్యకు తోడు ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెల్లడయ్యే అవకాశం ఉండటంతో పట్టాల పంపిణీని తన చేతులమీదుగా పూర్తిచేసేందుకు సీఎం సిద్ధమయ్యారు. ఆయన ముందుగా 20వతేదీనే ఒంగోలు రావాలని నిర్ణయించుకోవటంలోని ఆంతర్యం అదే. అయితే 25 వేలమందికి పట్టాలు సిద్ధం చేయగా లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయింది. గతంలో భరోసా పత్రాలు ఇచ్చిన వారిలో కొందరు కాంట్రాక్టు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరి అర్హతను కోల్పోయారు. అలాంటి వారు కూడా వెయ్యిమందికిపైగా ఉన్నారు. దీంతో మరో ఆరేడు వేలమంది కొత్త లబ్ధిదారులను గుర్తించాల్సిన అవసరం వచ్చింది. ఈ విషయంలోనే అధికారపార్టీ వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతోంది. ఇన్ని అడ్డంకుల మధ్య ఎన్నికల వేళ వ్యవహారం ఏమలుపు తిరుగుతుందనేది సందిగ్ధంగా మారింది.


కార్పొరేషన్ కార్యాలయంలో ఇళ్ల పట్టాల ప్రక్రియలో తలమునకలైన ఉద్యోగులు



పొదిలి నగర పంచాయతీ కార్యాలయం

హోదా ఉన్నా అభివృద్ధి సున్నా..!

• కునారిల్లుతున్న పొదిలి నగర పంచాయతీ • ఏడాదికి కోటిన్నర పన్నుల వసూలు • ఏమౌతున్నాయో తెలియని వైనం

పొదిలి, ఫిబ్రవరి 16 : పొదిలి పేరుకు మాత్రం నగర పంచాయతీగా ఉన్నా.., అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. అయినప్పటికీ, ఢిల్లీలో అవార్డు తీసుకున్న ఘనత మాత్రం ఈ నగర పంచాయతీకే దక్కుతుంది.

పొదిలి నగర పంచాయతీకి ఏటా పన్నుల రూపంలో కోటిన్నర రూపాయల ఆదాయం వస్తోంది. పన్నులు ముక్కుపిండి పన్నులు వసూలు చేసినప్పటికీ, ప్రజలు ఇబ్బందులకు గురైన సందర్భాల్లో ఖర్చు చేయకుండా వైసీపీ నాయకులు కనుసన్నల్లో నిధులు దుర్వినియోగం చేస్తుంటారు. అధికారపక్ష నేతల ఆదేశాల మేరకే అధికారులు నిధులు వెచ్చిస్తారు. నిధులు వెచ్చించాల్సిన అవసరం ఉన్నా.., లేకున్నా.., అధికార పక్షం నేతలు చెప్పిందే చేసుకుంటూ పోతున్నారు.

ఐదేళ్లగా కనిపించని అభివృద్ధి

మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు అరకొర నిధులతో కొరత ఉన్నప్పటికీ, అభివృద్ధి పనులు చేశారు. ప్రజ అవసరాలను గుర్తించి తాగునీరు, పారిశుధ్యం వంటి పనులు చేశారు. ఆ తరువాత నగర పంచాయతీగా స్థాయి పెరిగినా, అభివృద్ధి మాత్రం కనిపించడం లేదు.

ముచ్చటగా మూడేళ్లు

పొదిలి మేజర్‌పంచాయతీ నుంచి నగరపంచాయతీగా మారి ముచ్చటగా మూడేళ్లు పూర్తయ్యింది. అయినా ఎదుగుబొదుగు లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. జిల్లా నడికూడలిలో ఉన్న పొదిలి, పశ్చిమ ప్రాంతానికి ముఖద్వారంగా ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో పనిచేసే వివిధశాఖల అధికారులు కూడా ఇక్కడ ఉండడానికి ఇష్టపడతారు. అయినప్పటికీ, ఇక్కడ ఆశించిన స్థాయిలో మాత్రం అభివృద్ధి కనిపించడం లేదు. సాధారణంగా నగర పంచాయతీగా రూపాంతరం చెందే క్రమంలో ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు అందిస్తోంది. అయితే నిధులు ఎంత వచ్చాయో కానీ అర్థంకాని పరిస్థితి నెలకొంది.

ముఖంచాటేస్తున్న కాంట్రాక్టర్లు

గత ప్రభుత్వాల హయాంలో ఏమైనా అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు వస్తాయన నమ్మకం కాంట్రాక్టర్లలో ఉండేది. దీంతో వివిధ అభివృద్ధి పనుల కోసం కాంట్రాక్టర్లు పోటీపడేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జగన్ పాలనలో చేసిన పనులకు బిల్లులు చెలించకపోవడంతో ఎవరు ముందుకు రావడం లేదు. ఇక వైసీపీకి అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లు సైతం ఇసుక అక్రమ రవాణాపై, స్థలాల ఆక్రమణలపై దృష్టిసారించడం గమనార్హం. అమృత్ పథకం ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి నీరందించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. టెండర్లకు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరు రాకపోవడం గమనార్హం. గతంలో అప్పటి కమిషనర్ మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు కాని ఇంతవరకు అది ఏమైందో తెలీదు. అంతర్గతరోడ్లు వేశారంటే అదీ లేదు. పట్టణాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయకపోయినా పన్నుల రూపంలో ఏడాదికి కోటిన్నర వరకు వసూలు చేస్తుండడం గమనార్హం. అయితే ఈ సొమ్ము పంచాయతీ జీతభత్యాలకే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పొదిలి నగర పంచాయతీ అభివృద్ధిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్ల వెంబడి నిలిచిన మురుగు

అదుపు తప్పి ఆటో బోల్తా

• ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన సురేష్ బాబు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 16: వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన స్థానిక ఉర్దూ పాఠశాలకు సమీపంలో కర్నూలు -గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఐదుగురు గాయపడ్డారు. సాగర్‌కు చెందిన బాలకోటమ్మ, షరలింగ్, ఐనముక్కల గ్రామానికి చెందిన చరణ్, సురేష్, శేషారావులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఐనముక్కల గ్రామానికి చెందిన శేషారావు బంధువులు బాలకోటమ్మ, షెరలింగ్‌లు సాగర్‌కు వెళ్లాల్సి వచ్చింది. దీంతో మాచర్ల డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు ఎక్కించాల్సి ఉంది. కాగా అప్పటికే ఆ బస్సు ఆర్‌టీసీ బస్టాండు దాటి వెళ్లింది. ఈ బస్సులో సిబ్బంది టిఫిన్ కోసం ఊరు బయట ఓ హోటల్ వద్ద నిలుపుతారన్న సమాచారంతో సొంత ఆటోలో ఎక్కి వెళ్తుండగా మార్గమధ్యలో ఉన్న పళంగా ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో బాలకోటమ్మ, సురేష్, చరణ్‌లకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై అంకమ్మరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

లారీ, కారు ఢీ- ఆరుగురికి గాయాలు

కొమరోలు,ఫిబ్రవరి 16: లారీ, కారు ఢీకొని ఆరుగురికి గాయాలైన ఘటన స్థానిక అంకాలమ్మ గుడి మలుపు వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు.. తాటిచర్ల మోటు నుంచి వస్తున్న లారీ కొమరోలు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మొత్తం ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108కు వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల వైద్యశాలకు తరలించారు. ఘటన గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రశ్నే ప్రగతికి సోపానం

• జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు స్వరూపారెడ్డి


మాట్లాడుతున్న స్వరూపారెడ్డి

గిద్దలూరు, ఫిబ్రవరి 16 : ప్రశ్నించడం ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి అన్నారు. స్థానిక సూర్య విద్యానికేతన్‌లో జరిగిన కళాజాతసభలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించేతత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని పరిరక్షించుకునే క్రమంలో కళాజాత ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మూఢనమ్మకాలను తొలగించే నాటకాలను శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే పాటలను పాడగా అందరినీ అలరించాయి. కార్యక్రమంలో రాచర్ల ఎంఈవో కోటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి. నారాయణ, జెవివి నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, సూర్య విద్యానికేతన్ కరస్పాండెంట్ డీ.జీ.బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ భవనాలు సరే.. వసతులేవి..?

• శిథిలావస్థకు చేరుకుంటున్న ప్రభుత్వ కార్యాలయాలు


జేఈతో మాట్లాడుతున్న ప్రతినిధులు

కొమరోలు, ఫిబ్రవరి 16: మండలంలో అట్టహాసంగా గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య సురక్షా కేంద్రాలు నిర్మించినప్పటికీ, ఆయా భవనాల్లో కనీస వసతులు లేవని, తాటిచర్ల ఎంపీటీసీ సభ్యుడు కామూరి శ్రీనివాసరెడ్డి సమస్యను ప్రస్తావించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ నాగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈని ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి నిలదీశారు. సచివాలయాలకు విద్యుత్ సౌకర్యం, నీరు మరుగుదొడ్లు లేవన్నారు. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా ఉండి శిథిలమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ రాజ్ జేఈ సుబ్బారావు స్పందిస్తూ, పంచాయతీరాజ్ శాఖలో డబ్బులు లేవని, తాము నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిపారు. తాము భవనాలు కట్టి ఆయా శాఖలను బదిలీ చేసినట్లు తెలిపారు. ఆ భవనాల్లో మౌలిక వసతుల కోసం ఆయా శాఖలు నిధులు తెప్పించుకొని పనులు చేసుకోవాలన్నారు. ఏపీవో మహాలక్ష్మీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వార ఎక్కువ పని దినాలను వినియోగించుకునే విధంగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యాక్రమంలో ఎంపీడీవో కే నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పాల్గొన్నారు.

స్థానికంగా ఉండి సమస్యలు పరిష్కరిస్తా


మాట్లాడుతున్న నారాయణరెడ్డి

గిద్దలూరు, ఫిబ్రవరి 16 : తాను స్థానికంగానే ఉండి సమస్యలు పరిష్కరిస్తానని మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కె.నాగార్జునరెడ్డి అన్నారు. ఆయన తొలిసారిగా భారీర్యాలీతో నియోజకవర్గంలోకి ప్రవేశించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆయన్ను గజమాలతో కేడర్ స్వాగతం పలికింది. రాచర్లగేటు సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, కొమరోలు జడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటరాజు, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ డాక్టర్ చేరెడ్డి రంగారెడ్డి, రాచర్ల ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు, వైసీపీ నాయకులు సీఆర్‌ఐ మురళి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. గిద్దలూరు మున్సిపాలిటీకి చెందిన పలువురు నేతలు ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావడం గమనార్హం.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే : ఎరిక్షన్‌బాబు


బాండ్లు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో ఎన్నికల తర్వాత టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని చింతల అగ్రహారం గ్రామంలో శుక్రవారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రజలను కలుసుకొని గడిచిన ఈ ఐదేండ్ల కాలంలో ప్రజలు ఎంతగా ఇబ్బంది పడ్డారో తెలియజేశారు. గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశాడు. టీడీపీ హయాంలో ప్రతి గ్రామంలో 80శాతానికి పైగా సిమెంటు రోడ్లు నిర్మాణం, ఎటువంటి క్లిష్ట సమయంలోనూ త్రాగునీటి సరఫరా, ప్రకృతి విపత్తులలో రైతులకు నష్టపరిహారం అందజేత, వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రాయితీతో ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, డ్రిప్ అందజేత, నిలకడగా నిత్యావసర సరుకులు, అదపులో పెట్రోలు, గ్యాస్ ధరలు ఉన్నాయన్నారు. ఇక వైసీపీ పాలనలో ఏ ఒక్కటి సవ్యంగా లేవని, సామాన్యుడి నడ్డి విరిచేలా ధరలు ఆకాశ నంటాయన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశలు వమ్ము చేశారని ఆరోపించారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ పథకాల అమలు కోసం ముందుగానే ష్యూరిటీ బాండ్లను అందజేస్తు న్నామని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానని తనను ఆదరిం చాలని సైకిలు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, షేక్ ఇస్మాయిల్, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ భాష, ఎలకపాటి చంచయ్య, సీనియర్ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, కె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మవద్దు

• టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి
• వైసీపీని వీడీ ఆ పార్టీలో పలువురి చేరికలు


టీడీపీలో చేరిన కార్యకర్తలతో ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 16 : నిరంతరం మాయమాటలు, మోసపూరిత చర్యలు చేస్తున్న జగన్‌రెడ్డి మాటలను నమ్మవద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గిద్దలూరు మండలం వెంగలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పార్శ రామలింగస్వామి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అశోక్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం పేరుతో కొంత మంది మాత్రమే లబ్దిపొందుతున్నారని, అనేక మందికి సంక్షేమ పథకాలు అందడం లేదంటూ వారికి వివిధ కారణాలను చూపి తొలగిస్తున్నారని విమర్శించారు. నాటి టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా, ఎక్కడా మచ్చుకైనా అభివృద్ధి కానరావడం లేదని దుయ్యబట్టారు. పార్టీలో చేరిన వారిలో ఇడమకంటి పెద్దఒన్నూరురెడ్డి, పార్శ పాండురంగయ్య, బెక్కెం రామయ్య, శెట్టం అనీల్, మోక్షగుండం పెద్దఅంకయ్య, పార్శ రంగయ్య, షేక్ చాంద్, బీరం విశ్వనాథరెడ్డి, దేరంగుల వైష్ణు, పార్శ రంగస్వామి, బిజ్జం శేఖర్ రెడ్డి, షేక్ దాదావలి, మోక్షగుండం చిన్న అంకయ్య, టీడీపీ నాయకులు బద్రి గోపాల్‌రెడ్డి, అల్లం రంగస్వామి, రామిరెడ్డి రంగారెడ్డి, కంకర వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డంపల్లె నుంచి 20 కుటుంబాల చేరిక

మండలంలోని దొడ్డంపల్లె గ్రామానికి చెందిన సంగని వెంకటప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో వీరందరికీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సంగని వెంకటరామిరెడ్డి, రామకుమార్‌రెడ్డి, అంకిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బొర్రా నారాయణరెడ్డి, బాలుక్రిష్ణారెడ్డి, అంబటి భూపాల్‌రెడ్డి, జూటూరి ఖలీల్, ఎర్రంబట్టి బాలయ్య, సంగని రమణరెడ్డితోపాటు మండలపార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు కడియం శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు అండగా ఉంటా

నాయీ బ్రాహ్మణులకు తాను అండగా ఉంటానని, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక నాయీబ్రాహ్మణుల కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నీటి సమస్య లేకుండా చొరవ చూపానని, తాను నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సాధికార సమితి సభ్యులు పిలుట్ల సుధాకర్, జిల్లా సాధికార సమితి అధ్యక్షులు పాలూరి సత్యం, ఉదర రవికుమార్, కొణిదెల మోహన్‌రావు, గిద్దలూరు మండల నాయీబ్రాహ్మణ గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, బి.రామయ్య, కె.చిన్నశింగరయ్య, పి.బాల రంగయ్య, అధ్యక్షులు తొండమల్లు బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు కె.ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షహన్వావలి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్‌యాదవ్, ఉలాపు బాలచెన్నయ్య, గుర్రం దానియేలు, బొంతా లక్ష్మీదేవి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు


మార్కాపురంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పొదిలి, ఫిబ్రవరి 16 : పట్టణంలో శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వేదపండితులు మురళీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి పట్టణంలోని పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు.


పొదిలిలో ఊరేగింపు, కొమరోలులో రథోత్సవం

మార్కాపురం వన్‌టౌన్ : గుండ్లకమ్మ నదీతీరాన వెలసిన లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితులు అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చక్కా మాలకొండ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఊటుకూరి రామ కృష్ణారావు, కోశాధికారి పీవీ శ్రీనివాసుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కొమరోలు : మండలంలో రథసప్తమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తొమ్మిది వాహనాల్లో శ్రీనివాసుడు గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై చంద్రప్రభ వాహనంతో ముగించారు. ఈ సందర్భంగా పూజారి వెంకట్ మాట్లాడుతూ రథసప్తమి అనేది సూర్యుని పుట్టిన రోజుగా పరిగణిస్తారు. వారిని ఈరోజు పూజించినవారికి సకల సిరిసంపదలు వర్ధిస్తాయని తెలిపారు.

కంభం : శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేతత వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 5గంటలకు సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.


మార్కాపురంలో చెన్నకేశవస్వామికి సూర్యప్రభ, గరుడ, హనుమంత, కల్పవృక్ష వాహన సేవలు

శోభాయమానంగా చెన్నయ్య అలంకరణలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 16: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి వాహనసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ, శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష వాహనాలపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి వెండిరథంపై అంగరంగ వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు వాహన సేవలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున వివిధ వాహన సేవల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి రథసప్తమి ఉత్సవ సేవా సంఘం అధ్యక్షులు యక్కలి కాశీవిశ్వనాథం, ఆలయ మాజీ ఛైర్మన్ పెనుగొండ కేశవరావు, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య, ప్రముఖులు పాల్గొన్నారు. డీఎస్పీ బాలసుందరరావు ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, పోలీసులు సబ్ డివిజన్‌లోని ఎస్‌ఐలు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో శ్రీచక్రస్నానం నిర్వహించారు. శ్రీ మహావిష్ణువు ప్రధాన అయుధమైన శ్రీచక్రానికి అర్చకులు అప్పనాచార్యులు, రంగాచార్యులు, సాయి కుమారాచార్యులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు.

30 చోట్ల అన్నప్రసాద వితరణ

మార్కాపురం వన్‌టౌన్ : రథసప్తమిని పురస్కరించుకొని పట్టణంలోని 30 ప్రాంతాల్లో అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఏపీఐఐసీ ఛైర్మన్ జంకె వెంకటరెడ్డి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో నుంచి సాయంత్రం అల్పాహారం, నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. నాలుగు మాడవీధులను శుభ్రపరిచారు.

అవీ..ఇవీ..

వైభవంగా కుసుమ హరనాథుల కల్యాణం


పూజలు చేస్తున్న అశోక్‌రెడ్డి దంపతులు

గిద్దలూరు, ఫిబ్రవరి 16 : పట్టణంలోని శ్రీ కుసుమ హరనాథ మం దిరం ఆవరణలో శుక్ర వారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా కుసుమ హరనాథుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు ఈ వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, కుసుమ హరనాథ మందిరం అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, అమ్మవారిశాల అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల పెంట సత్యనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్ధన్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

తపాలాబీమా, పొదుపు పథకాలపై అవగాహన


బీమా చెక్కును అందజేస్తున్న అధికారులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 16: తపాలాశాఖలో బీమా పథకాలు, పొదుపు పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలాశాఖ మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అందిస్తున్న రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, పదేళ్లలోపు ఆడబిడ్డలకు కేంద్రం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన, తపాలాశాఖలోని ఇతర బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు వివరించారు. మార్కాపురం పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ డి.నాగరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, జీవనజ్యోతి బీమాయోజన, పోస్ట్‌పేమెంట్స్ బ్యాంక్ థర్డ్‌పార్టీ ఇన్సూరెన్సులపై వివరించారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల బీమా చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజరు జె.సాయిరాం, స్థానిక సబ్ పోస్టుమాస్టర్ షాకీర్, మెయిల్ ఓవర్సీస్ భాస్కరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలందరూ ఏకం కావాలి

• బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 16: రాష్ట్రంలోని బీసీలందరూ ఏకం కావాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసనశంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక సంఖ్యల్లో బీసీలున్నా ఆధిపత్య కుల బూర్జువా పార్టీలే రాజ్యాధికారం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని 139 బీసీ కులాల ఐఖ్యత వల్ల ధనరాజకీయం పోయి జనరాజకీయాలు వస్తాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీ సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడే నిజాయితీ కల్గిన వారికి ఓటు వేద్దామన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ద్వారకా శ్రీనివాసులు, బండారు సుబ్బనారాయణ, కే.శ్రీనివాసులు, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 16: మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని కమలా పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహిస్తారన్నారు. ఉచితంగా కంటిపరీక్షలు, కంటిశుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చే పేషెంట్లు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలు, కుటుంబ సభ్యుల ఫోన్‌నెంబర్ తీసుకురావాలన్నారు. వివరాలకు 9949647672 నంబరును సంప్రదించాలని తెలిపారు.

మోదీ విధానాలే దేశానికి రక్ష


ప్రజలకు అభివాదం చేస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలే దేశాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తాయని, డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, రామచంద్ర, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌రెడ్డికి వణుకు

• టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 16 : రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు పుడుతోందని ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడడం ఇదే తొలిసారి అని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించారు. ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందనే భయంతో వైసీపీ కోర్టుకు వెళ్లిందన్నారు. 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధానికి భూములను ఇచ్చిన రైతుల త్యాగాలను బూడిదలో పోసిన పన్నీరు చేశాడని సీఎంను విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీ పార్టీకి బుద్ధి చెప్పుతారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఆక్రందనకు దృశ్యరూపమే రాజధాని ఫైల్స్

కంభం : రైతుల ఆక్రందనకు దృశ్యరూపమే రాజధాని ఫైల్స్ అని టీడీపీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒక సినిమా చూసి భయపడే స్థితిలో జగన్‌రెడ్డి ఉన్నాడన్నారు. 34 వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవ రూపంగా నిలిచిన రాజధాని ఫైల్స్ సినిమా నిలిచిందన్నారు. వారి త్యాగాలను బూడిదలో వేసిన పన్నీరుగా మిగిలిందన్నారు. సినిమాను అడ్డుకోవాలని చూడడం దారుణమన్నారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి క్లస్టర్ ఇన్‌చార్జి మల్లికార్జున, ఎస్సీసెల్ కార్యదర్శి చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.


బ్యారన్ల వద్ద రైతులు, కూలీలతో మాట్లాడుతున్న పరిటాల సురేష్

బీసీలకు అండగా నిలిచింది టీడీపీనే

దొనకొండ, ఫిబ్రవరి 16 : రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి, సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలిచి వారి అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేసిందని టీడీపీ జిల్లా లీగల్‌సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ పేర్కొన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో ప్రతిపల్లెకు పరిటాల ప్రజాయాత్ర కార్యక్రమాన్ని గంగదేవిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను అనేక విధాలుగా వేధిస్తున్నదని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీని తుది ముట్టించటానికి అన్నీ వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొరిగొర్ల పోలయ్య అక్కయ్య, గురుబాబు, సుబ్బయ్య, బత్తుల అంకయ్య, రాజయ్య, కొండయ్య కోటయ్య పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

తాళ్లూరు, ఫిబ్రవరి 16 : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని తూర్పుగంగవరం గ్రామంలో చిరుధాన్యాలతో 100 రకాల వంటలు- 100 వ్యాల్యుఏడెడ్‌మిల్లెట్ రెసిపీస్' పుస్తకాలను ఆర్‌బీకే సిబ్బందికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ చిరుధాన్యాల వల్ల అనేక రకాల ఆరోగ్య లాభాలువున్నాయని, వాటిని వంటకాలుగా చేసుకుని పలు రకాలుగా ఆహారంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ప్రతి మహిళ ఈ చిరుధాన్యాల వంటకాలపై దృష్టి పెట్టాలన్నారు. చిరుధాన్యాలైన జొన్నవంటకాల వల్లశక్తి, పెరుగుదల, మలబద్ధకం నివారించ వచ్చునన్నారు. మధుమేహ వ్యాధి గ్రస్తులకు చక్కెర నివారణ, కొలెస్ట్రాల్ తగ్గించటం, గ్లూటిన్‌ఎలర్జీ, సీలియాన్ వ్యాధిగ్రస్తులకు అనువైన ఆహారంగా ఉంటుందన్నారు. వంట తయారీకి కావాల్సిన పదార్థాలు, వాటిపరిమాణం, తయారీ విధానం,పోషక విలువల వివరాలు పుస్తకంలో పొందు పరిచి ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు, ప్రకృతి సాగు ఇన్‌ఛార్జి నరసింహులు, రైతులు పాల్గొన్నారు.


చిరుధాన్యాల పుస్తకాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగింపు

తాళ్లూరు, ఫిబ్రవరి 16 : కలెక్టర్ ఆదేశాను సారం స్థానిక రెవెన్యూ అధికారుల ఒత్తిడి మేరకు ఎట్టకేలకు వెలుగువారిపాలెం (ఏపీ) పాఠశాల ఆవరణలోని ఆక్రమణలను శుక్రవారం ఆక్రమణదారులు తొలగించారు. గ్రామస్థులు, పాఠశాల హెచ్‌ఎంలు పాఠశాల స్థల ఆక్రమణ విషయమై కలెక్టర్‌కు నాలుగు నెలల క్రితం విన్నవించగా తక్షణమే తొలగించాలని స్థానిక తహసీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. అధికారులు పలు మార్లు వెళ్లి ఆక్రమణదారులతో మాట్లాడి తొలగించాలని చెప్పినా పట్టించుకోక పోవటంతో వారికి నోటీసులు ఇచ్చి చట్టపరంగా చర్యలు చేపట్టారు. దీంతో ఆక్రమణదారులు తామే తొలగిస్తామని అధికారులకు లిఖిత పూర్వక హామీ ఇచ్చారు. దీంతో రెండు రోజులుగా ఆక్రమణదారులు స్వచ్ఛందంగా పాఠశాల ఆవరణలో ఉన్న గేదెల షెడ్డులను, పూరిపాకలను తొలగించారు. పాఠశాల ఆవరణలో ఆక్రమణల తొలగింపు పనులను తహసీల్దార్ షేక్ మహమ్మద్ హు స్సేన్ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ పీఎస్ఆర్ మూర్తి, వీఆర్‌వో ఎం.రమణారెడ్డిలు ఉన్నారు.


పాఠశాలలోని ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించిన ఆక్రమణదారులు

ఉచిత కంటి పరీక్షలు అభినందనీయం

దొనకొండ, ఫిబ్రవరి 16 : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు అందించటం అభినందనీయమని ప్రముఖ వైద్యులు, రిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మల్లిఖార్జునశర్మ, ఉపాధ్యాయుడు బొరిగొర్ల మురళీకృష్ణ పేర్కొన్నారు. దొనకొండలో ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి వైద్యశాల ఏర్పాటు చేసి ఏడాదికాలం పూర్తయిన సందర్భంగా శుక్రవారం కేకు కట్ చేసి వార్షిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మ మాట్లాడుతూ ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి యాజమాన్యం దొనకొండలో బ్రాంచ్‌ఏర్పాటు చేసి ఉచితంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి కో-ఆర్డినేటర్ కె. దేవయ్య మాట్లాడుతూ ఏడాది కాలంలో దాదాపు 2,500 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశామని చెప్పారు.ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ రెహమాన్, టీడీపీ యువ నాయకుడు కుందుర్తి లక్ష్మణ్, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందు పంపిణీ

పీసీపల్లి, ఫిబ్రవరి 16: చిన్నారులకు సంక్రమించే నులిపురుగులను నివారించేందుకు పాఠశాల విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారిణి నులిపురుగుల నివారణ మందును పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఎన్. యశిత శుక్రవారం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమణారెడ్డి, ఎంఈవోలు సంజీవి, ఆర్‌శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ రేణుకాదేవిలు ఉన్నారు.

362 మందికి వైద్య పరీక్షలు

మండలంలోని చినవరిమడుగు సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష క్యాంపును ఏర్పాటు చేశారు.ఈ క్యాంపులో డాక్టర్ మంజుల, డాక్టర్ వీరాంజనేయ నాయక్ ఆధ్వర్యంలో 362 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 64మందికి కంటి పరీక్షలు చేశారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

పామూరు, ఫిబ్రవరి 16 : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తూ అధిక నిధులు కేటాయిస్తున్నదని వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలను విద్యార్థులు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు.ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా దద్దాల పాల్గొని ప్రసంగించారు, పదవ తరగతి సమ్మిట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పీసీపల్లి, ఫిబ్రవరి 16 : నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలు ప్రధానోపాధ్యాయురాలు టి.అంజనీదేవి నేతృత్వంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సమాజానికి అద్దం పట్టేలా పలు నాటికలను ప్రదర్శించారు. కోలాట ప్రదర్శన చేశారు.

రోడ్డు వేయాలని వినతి

కురిచేడు, ఫిబ్రవరి 16: ఆవులమంద నుంచి పడమర నాయుడుపాలెం వచ్చే రోడ్డు అధ్వానంగా ఉందని, రోడ్డు నిర్మించాలని కురిచేడు మండలం పడమర నాయుడుపాలెం గ్రామ వాసులు వైసీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం సాయంత్రం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు

ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ముండ్లమూరు, ఫిబ్రవరి 16 : స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించింది బీసీల కోసమేనని, బీసీలకు టీడీపీ ఆవిర్భావంతోనే గుర్తింపు వచ్చిందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా వారంతా తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటారని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పూరిమెట్లలో జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నూకసాని మాట్లాడుతూ గతంలో పాలించిన పార్టీలన్నీ బీసీల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో కూడా బీసీలకు అనేక పదవులు ఇచ్చి గుర్తించారన్నారు.వారి కోసం ఆదరణ పథకం పెట్టి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాన్నారు. నేడు రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పాలిట ద్రోహిగా మిగిలారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో బీసీలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టి జైలుకు పంపడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అన్ని వర్గాల వారికి న్యాయం జరిగింది తెలుగుదేశం పార్టీలోనన్న విషయం గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు వివిధ కార్పొరేషన్‌ల ద్వారా పదవులు ఇచ్చి వారిని కుర్చీలకే పరిమితం చేశారన్నారు. ఏ ఒక్కరికి అధికారం లేని పదవులు ఇచ్చారన్నారు. టీడీపీ మరో రెండు నెలల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు గతంలో ఇచ్చిన గుర్తింపు కంటే అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. బీసీలపై పెట్టిన అక్రమ కేసులను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన దగ్గర నుంచి ఇసుక, మద్యం, భూదందాలు తప్ప అభివృద్ధి ఏ మాత్రం జరిగిన దాఖలాలు లేవన్నారు. కేవలం వైసీపీ నాయకులు, ఆ పార్టీ కార్యకర్తలు బాగు పడ్డారు తప్ప సామాన్య ప్రజలు మాత్రం అలాగే ఉండి పోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. ఆ పాలన అంత మొందించటానికి రెండు నెలలు మాత్రమే సమయం ఉందన్నారు. ప్రజలందరూ ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. జనసేన నియోజక వర్గ నేత గరికపాటి వెంకట్ మాట్లాడుతూ జనసేన, టీడీపీ పొత్తుతో వైసీపీ అడ్రస్ లేకుండా పోవటం ఖాయమన్నారు. సామాన్య కార్యకర్తలందరూ వైసీపీ అరాచక పాలన గురించి తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, గోరంట్ల రవికుమార్, దర్శి మునిసిపల్ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, ఒంగోలు పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కొక్కెర నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ వరగాని పౌలు, మాజీ ఎంపీపీ కే మస్తాన్‌రావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు చింతపల్లి వెంకట స్వామి, సుంకర రాఘవరెడ్డి, నిడమానూరు శ్రీనివాసరావు, కుంచెపు ఏడుకొండలు, జిల్లెలమూడి చౌదరి, బద్రి గోపాలరెడ్డి, చావా బ్రహ్మయ్య, కూరపాటి నారాయణ స్వామి, గజ్జల సుబ్బారెడ్డి, అబ్బూరి గోవిందయ్య, యడ్లపల్లి జక్రయ్య మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట రామారావు, నిడిగంటి నారాయణ, ఒగులూరి రమణయ్య, నాగేశ్వరరావు, ఎంపీటీసీ పాలపర్తి సుబ్బారావు, అంకమరావు, రమణ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


పూరిమెట్లలో బీసీ సదస్సుకు హాజరైన టీడీపీ నేతలు బాలాజీ, పాపారావు, వెంకట్ తదితరులు

యాత్రల సినిమాలతో జగన్‌కు అంతిమ యాత్రే

టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి రోషన్ సంధాని


కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి రోషన్ సంధాని

కనిగిరి, ఫిబ్రవరి 16: జగన్ తన స్వార్థ ప్రయోజనాల కోసం యాత్రల సినిమాలు తీసుకున్నా ప్రజలు మాత్రం జగన్‌కు అంతిమ యాత్ర చేసేందుకు వేచి ఉన్నారని టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి రోషన్ సంధాని అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం రాజధాని ఫైల్స్ సినిమా అడ్డుకోవటంపై తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంధాని మాట్లాడుతూ టీడీపీ హయాంలో అమరావతి రాజధానిగా అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం జరిగిందని గుర్తు చేశారు. ఆ సమయంలో అందుకు ఒప్పుకున్న ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఐదేళ్లలో రాజధానిని పూర్తిగా నిర్వీర్యం చేశాడని ఆరోపించారు. రాజధాని కోసం అమరావతి ప్రాంతంలో ఉన్న రైతులు ఉదారంగా 34వేల ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. అధికారంలో వచ్చిన జగన్ ఆ భూములలో రాజధాని నిర్మాణం కోసం జరుగుతున్న పనుల నిర్మాణాలను నిలిపివేయటమే కాకుండా నిర్మాణాలను కూడా పడవేసి, వేసిన రోడ్డులను తీయించి వేసిన సైకో జగన్ అని అన్నారు. రాజధాని కోసం అమరావతి రైతుల నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తుంటే వారిపై పోలీసుల చేత దాడులు చేసిన జగన్ నియంత వైఖరికి నిదర్శనమన్నారు. అధికారంలోకి రాగానే ప్రజావేదికలో మొదటి సమావేశం పెట్టిన జగన్ ఆ వేదిక చూసి ఓర్చుకోలేక కూల్చివేసిన దుర్మార్గుడని దుయ్యబట్టారు. ఇలా ఐదేళ్లలో రాజధాని నిర్వీర్యం కోసం కుట్రలు పన్నాడన్నారు. అలాంటి ఘటనలన్నింటికి దగ్గరగా రాజధానిఫైల్స్ సినిమా ఉందని, ఆ సినిమాను అడ్డుకునేందుకు జగన్ కుట్ర పన్నాడని అన్నారు. అందులో భాగంగా వైసీపీనేత లేళ్ల అప్పిరెడ్డి చేత హైకోర్టులో పిటిషన్ వేయించి అడ్డుకున్నారన్నారు. కానీ, ఆయా సినిమా యాజమాన్యం హక్కులున్న వారు కోర్టును ఆశ్రయించటంలో కోర్టు సినిమా ప్రదర్శించేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు. కానీ సినిమా ప్రదర్శనను జరుగనీయకుండా వైసీపీ మూకలు ప్రతి చోట అడ్డుకుంటూ సినిమా థియేటర్లను ధ్వంసం చేయటం చూస్తుంటే జగన్ సినిమా విషయంలో భుజాలు తడుముకుంటున్నాడన్నారు. అయితే అందులోని ప్రతి సన్నివేశం జగన్ చేసినవేనని అనుమానించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుని వచ్చే ఎన్నికల్లో సైకోకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, గుడిపాటి ఖాదర్, బుల్లా బాలబాబు, సిద్దాంతి బారాయిమాం, అహ్మద్, కాసుల శ్రీరాం యాదవ్, జంషీర్, కేవీఎస్‌గౌడ్, తిరుపాలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో భయపడ్డ జగన్

వెలిగండ్ల, ఫిబ్రవరి 16 : రాజధాని ఫైల్స్ సినిమాను చూసి సీఎం జగన్ రెడ్డి భయపడ్డాడని టీడీపీ మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు శుక్రవారం వెలిగండ్లలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ముత్తిరెడ్డి మాట్లాడుతూ వాస్తవ సన్నివేశాలను కళ్ళకు కట్టినట్లుగా సినిమాను రూపొందించి ప్రజల ముందుకు తీసుకవచ్చారని, కానీ సీఎం జగన్ అధికారం అడ్డం పెట్టుకొని సినిమాను నిలిపివేయించడం తన నీతి చరిత్రకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. న్యాయబద్ధంగా హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు చిత్రం విడుదలకు అభ్యంతరాలు లేవని స్పష్టం చేసిందని,దీంతో జగన్‌రెడ్డి చెంప చెల్లుమనిపించిదన్నారు ఐదు కోట్ల మంది ఆంధ్రుల కలల రాజధానిని విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. ప్రాంతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. నిన్నటి దాక మూడు రాజధానులని బీరాలు పలికిన జగన్ నేడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అనడం సిగ్గుచేటున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, కొండుభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కారంపూడి వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు మెటాటి సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తిరెడ్డి

హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌తో చిత్ర ప్రదర్శన

పామూరు, ఫిబ్రవరి 16 : హైకోర్టు ఆదేశాలతో రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శన ను గురువారం నిలిపి వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ ఇచ్చిన పత్రాలను పరిశీలించిన హైకోర్టు ఉన్నత న్యాయస్థానం స్టే కొనసాగించేందుకు నిరాకరించింది. దీంతో చిత్ర ప్రదర్శనకు శుక్రవారం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పామూరులోని కేబీ సినిమ్యాక్స్ థియేటర్‌లో చిత్ర ప్రదర్శనను కొనసాగించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి


కనిగిరి : ర్యాలీలో మాట్లాడుతున్న వీరారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే వీరారెడ్డి అన్నారు. గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం కనిగిరిలో వామపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సుదీర్ఘ పోరాటాల ద్వారా నల్ల చట్టాలను రద్దు చేస్తే కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన ఆ చట్టాలను అమలు చేయటం దుర్మార్గమన్నారు. రైతు రుణ విమోచన చట్టం, నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలన్నారు. లేకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దేశంలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు యాసిన్, గుజ్జుల బాలిరెడ్డి, సీఐటీయూ నాయకులు పీసీ కేశవరావు, సీపీఐ, సీపీఎం, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, రైతు కార్మిక, కర్షక, శ్రామిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో

ముండ్లమూరు : ముండ్లమూరులో శుక్రవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ బంద్‌లో సీఐటీయూ కార్యకర్తలు, అంగన్ వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పోస్టాఫీసు, ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లను మూసి వేయించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడగా ఈ కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, ఎర్రయ్య, కొండలు, రమేష్, సత్యం, విజయలక్ష్మీ, జయశ్రీ, దీనమ్మ, శేషమ్మ, రాధా తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి:ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని సీఐటీయూ నాయకులు మహేష్ అన్నారు. పీసీపల్లిలో శుక్రవారం సీఐటీయూ, రైతుసంఘం ఆధ్వర్యంలో సమ్మె చేశారు. అంగన్‌వాడీ, ఆశా, తాపీ, రైతు, వ్యవసాయ కార్మికసంఘం, ఉపాధిహామీ , ఎల్ఐసీ ఏజెంట్‌లు, చేతివృత్తి దారులు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దర్శిలో..


దర్శిలో బ్యాంకును మూయిస్తున్న వామపక్షాలు

దర్శి: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వామపక్షాల నాయకులు దర్శిలో శుక్రవారం బంద్ నిర్వహించారు. సీపీఎం దర్శి డివిజన్ కార్యదర్శి టి. రంగారావు, సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్నీ బ్యాంకులను, ఎల్ఐసీ కార్యాలయాన్ని మూసి వేయించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు సందు వెంకటేశ్వరరావు, యు. నారాయణ, అంజయ్య, కరుణానిధి, టి. నాగేశ్వరరావు, జాన్ సామ్యేల్, ఇస్సాక్, అంజిబాబు, అరుణ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి సమ్మెలో భాగంగా మండల కేంద్రమైన పీసీపల్లిలో శుక్రవారం సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో సమ్మె చేశారు. తొలుత హాస్పిటల్ సెంటరు నుంచి బ్యాంకు సెంటరు వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సమ్మెలో అంగన్‌వాడీ, ఆశా, తాపీ, రైతు, వ్యవసాయ కార్మికసంఘం, ఉపాధిహామీ పథకం, ఎల్ఐసీ ఏజెంట్‌లు, చేతివృత్తి దారులు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దొనకొండలో

దొనకొండ : కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం బంద్ చేపట్టారు. సీఐటీయూ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి కెనరా బ్యాంక్, పోస్టాఫీస్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లను బంద్ చేయించారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. పురవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

వెలిగండ్ల, ఫిబ్రవరి 16 : కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో ఈ నెల 18వ తేదీన నిర్వహించే ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి కోరారు. శుక్రవారం వెలిగండ్ల టీడీపీ కార్యలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జననీ చార్టిబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చెసుకోవాలని కోరారు.

వీరాంజనేయులు కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ముండ్లమూరు, ఫిబ్రవరి 16 : చిన్న వయస్సులోనే బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయిన ముండ్లమూరు గ్రామానికి చెందిన కోండ్రు వీరాంజనేయులు మృతి దురదృష్టకరమని, ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. గురువారం జూనియర్ లైన్‌మెన్ వీరాంజనేయులు మృతదేహానికి నివాళులర్పించి అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరాంజనేయులు భార్య విజయలక్ష్మికి రూ. 25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే రాష్ట్ర యూనియన్ జనరల్ సెక్రటరీ నర్రా మల్లిఖార్జునరెడ్డి, ఏడీఏ కే . పిచ్చయ్య, ముండ్లమూరు ఇన్‌చార్జ్ ఏఈ ఏవీ బ్రహ్మం, విశ్రాంత ఏఈ భూరాజు, ఎల్ఐ సాంబయ్య, లైన్‌మెన్ ఆంజనేయులు నివాళులర్పించారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు


రథంలో ఊరేగింపులో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి వారు

కనిగిరి, ఫిబ్రవరి 16: రథసప్తమి వేడుకలు శుక్రవారం కనిగిరిలో ఘనంగా జరిగాయి. పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి రథంలో ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. స్వామి వారు రథంలో పురప్రజలకు దర్శనమిచ్చారు. ఈ ఊరేగింపులో ప్రజలు పారువేట పోశారు. స్వామి వారికి హారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసింది. అదేవిధంగా భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి స్వామివారి ఊరేగింపు కార్యక్రమంలో కోలాటం, భజన, నృత్య ప్రదర్శనలు చేశారు.

ప్రజలందరికీ అండగా ఉంటా


ప్రజలతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి తదితరులు

దర్శి, ఫిబ్రవరి 16 : దర్శి నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచి నిస్వార్థ సేవలందిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే, దర్శి నియోజకవర్గ ఇన్ చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. మన ఊరు-మన శివన్న కార్యక్రమంలో భాగంగా దర్శి పట్టణంలోని 17వ వార్డులో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్యూటిఫికేషన్‌కార్పొరేషన్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కె. రాంభూపాల్‌రెడ్డి, కట్టెకోట హరీష్, కొల్లా భాస్కర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముండ్లమూరు, ఫిబ్రవరి 16 : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ యూ. వెంకటకృష్ణయ్య శుక్రవారం సాయంత్రం మండలంలోని మారెళ్ళ, జమ్మలమడక, నాయుడుపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకొనే ఓటర్లకు ర్యాంపు, తాగునీరు, రన్నింగ్ వాటర్‌తో పాటు కిటికీలు, తలుపులు మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని సరి చేయించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ప్రధానంగా విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ గోవనబోయిన వెంకటేశ్వరరావు,శ్రీనివాసరావు, ఎంపీటీసీ సుబ్బారావు, బీఎల్‌వోలు ఉన్నారు.


మారెళ్ళలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట కృష్ణయ్య

లక్ష్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

పామూరు, ఫిబ్రవరి 16 : విద్యార్థులు లక్ష్యంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని ఎస్‌వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సమీర్ సూచించారు. స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సరం వెల్‌కం పార్టీ అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన కొద్ది కాలంలోనే విద్యార్థులు పరీక్షల్లో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.


వార్షిక వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు


రా... కదలి రా!
తెలుగుదేశం, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో
పర్చూరు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న
రా... కదలి రా! కార్యక్రమానికి విచ్చేయుచున్న
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
టిడిపి, జనసేన నాయకులకు, కార్యకర్తలకు,
అభిమానులకు స్వాగతం - సుస్వాగతం
బహిరంగ సభ :
తేది : 17-2-2024 నేడు (శనివారం) మధ్యాహ్నం
1.30 గంటలకు పర్చూరు నియోజకవర్గం, ఇంకొల్లు గ్రామం,
తారక రామ విజయభేరి ప్రాంగణంలో జరుగును.
మీ
డా॥ వుండవల్లి శ్రీదేవి
శాసనసభ్యురాలు, తాడికొండ, గుంటూరు జిల్లా

మళ్లీ బాదేశారు

రూ.35 కోట్ల భారం

- మున్సిపాల్టీల్లో పెరగనున్న ఆస్తి పన్ను
- వరుసగా మూడో సారి పెరగనున్న వైనం
- పెరిగిన పన్నులు ఏప్రిల్ ఒకటి నుంచి వసూలు
- ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం పుర పౌరులపై మరో సారి ఆర్థిక భారం మోపనుంది. ప్రభుత్వం బాదుడే బాదుడు అన్న నినాదాన్ని అమలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చెత్త పన్నుకు తోడు ఆస్తి పన్ను పెంపుదలపై పట్టణవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వీరి మొర ఆలకించే వారే లేరు. మున్సిపాల్టీల పరిధిలోని ఆస్తి పన్ను పెంచేందుకు రంగం సిద్ధమైంది. ఆస్తి పన్ను పెరుగుదలకు హద్దు లేకుండా పోతున్నది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయవచ్చో మున్సిపాల్టీల్లో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తున్నది. ప్రస్తుతం ఉన్న పన్నును మరో 15 శాతం పెంచనున్నది. పెరిగిన ఆస్తి పన్ను ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. ఆస్తిమార్కెట్ విలువ(రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా పన్నును విధిస్తున్నది. దీని ప్రకారం ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేసి, దాని ఆధారంగా ఆస్తి పన్ను విధిస్తున్నారు. గతంలో అద్దె విలువ, మున్సిపాల్టీలో జోన్ల వారీగా విభజించి ఆస్తి పన్ను విధించేవారు. భవన నిర్మాణ కొలతలను పన్ను విధింపులో పరిగణనలోకి తీసుకునేవారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించే వారు. 1997 నుంచి అమల్లో ఉన్న దీనిని వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. వైసీపీ ప్రభుత్వం కొత్త విధానంలో భవనంతో పాటు, భవనం నిర్మించిన స్థలం, ఒక వేళ భవనం చుట్టూ ఖాళీ వదిలితే దానికీ పన్ను విధిస్తున్నారు. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటా పెరుగుతోంది. క్యాపిటల్ వాల్యు ప్రకారం పన్ను నిర్ణయించిన సమయంలో గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారిస్తారు. తేడా ఉన్న పన్ను ఏటా 15 శాతం పెరుగుతుంది. మార్కెట్ విలువకు సమానం అయ్యే వరకు పన్ను ఆ మాదిరిగా పెరుగుతూనే ఉంటోంది.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పురపాలక సంఘాలు, గుంటూరు కార్పొరేషన్‌లో పుర పౌరులపై దాదాపు రూ.35 కోట్లు ఆస్తి పన్ను భారం పడనున్నది. ఆస్తి పన్ను విషయంలో ప్రభుత్వ తీరు తగ్గేదేలే అన్న రీతిన ఉన్నది. నరసరావుపేటలో పన్ను డిమాండ్ సుమారు రూ.7.47 కోట్లు. ఈ ప్రకారం 15 శాతం పన్ను పెరగడంతో మున్సిపాల్టీ ఆదాయం దాదాపు రూ.1.12 కోట్లు వరకు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే రీతిలో మిగిలిన మున్సిపాల్టీల్లో కూడా పన్నులు అమాంతం పెంచేశారు. ఈ పెరిగిన పన్నులను ఏప్రిల్ నుంచి వసూలు చేయనున్నారు. ఆ ప్రకారమే యజమానులకు పన్నుల రశీదులు అందనున్నాయి.



రైతుకు నోటీసులు.. బెదిరింపులు

- మనస్ఫూర్తిగా భూమిని ఇచ్చానన్న రైతు
- ఆర్టీసీ స్థలానికి కంచె వేసిన అధికారులు
- సభను అడ్డుకునేందుకు వైసీపీ విశ్వప్రయత్నాలు

ఇంకొల్లు: ఇంకొల్లులో శనివారం జరిగే చంద్రబాబు రా కదిలిరా సభను అడ్డుకునేం దుకు అధికార పార్టీ పెద్దలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సభ ఏర్పాటు చేసిన స్థలానికి అనుమతి పత్రం ఇచ్చిన కౌలురైతు కరి వెంకటనారాయణకు దేవదాయ శాఖ అధికారులు శుక్రవారం నోటీసులు అందజేశారు. కేసులు నమోదు చేస్తామని రైతును బెదిరించినట్లు సమాచారం. మరో రెండేళ్లు ఆ భూమి తన ఆధీనంలో ఉం టుందని, వైసీపీ అభిమానినైనా మనస్ఫూర్తిగా చంద్రబాబు సభకు స్వచ్ఛందంగా భూమిని ఇచ్చానని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అధికారులు అడ్డంకులు సృష్టించడం దారుణమన్నారు. మరో వైపు సభా ప్రాంగణానికి సమీపంలో ఉన్న ఆర్టీసీ ఐదెకరాల భూమిని వాడుకోకుండా ఆ శాఖ అధికారులు శుక్రవారం హడావుడిగా ఫెన్సింగు వేశారు. పార్కింగుకు వాడుకునే విధంగా నిర్వాహకులు ఈ స్థలాన్ని బాగు చేసుకున్నారు. అయితే శుక్రవారం ఆర్టీసీ అధికారులు దారులు మూసి వేయడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సభను విజయవంతం చేసి తీరుతామని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.



16 దాటినా.. పస్తులే..



- 21,212 ఉద్యోగ కుటుంబాల్లో ఆకలి కేకలు
- దారుణంగా వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల పరిస్థితి
- జనవరి జీతం మార్చిలో వేస్తామనే సందేశాలపై ఆందోళన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 16: గతంలో పీఆర్సీ, డీఏల కోసం ఎదురు చూసే ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు జీతాల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. ముఖ్యంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా మారింది. ఏ నెలలో కూడా ఠంచన్‌గా జీతాలు తీసుకున్న పరిస్థితి లేదు. ప్రతీ నెలా సగం రోజులు గడిస్తే కాని జీతం అందని పరిస్థితి. అసలే అంతంతమాత్రంగా ఉన్న జీతాలకు తోడు ఆలస్యంగా ఇస్తుండటంతో ఆయా కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఫిబ్రవరి నెలలో 16 రోజులు దాటినా జనవరి నెల జీతాలు రాకపోవడంపై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాంట్రాక్టు విధానంలో 11897 మంది, ఔట్ సోర్సింగ్ విధానంలో 9315 మంది ఆయా శాఖల్లో పనిచేస్తున్నారు. ఈ 21,212 కుటుంబాలు కేవలం జీతాల మీదే ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రతి నెలా జీతాలు ఆలస్యం కావడంతో ఇంటి అద్దెలు, నిత్యావసర సరుకులు, పిల్లల స్కూల్ ఫీజుల కోసం అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెల వేతన కష్టాలు తప్పడంలేదు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు ఉద్యోగులను కూడా గ్రీన్‌ఛానల్‌లో ఉంచి ఒకటో తేదీనే జీతాలు చెల్లించేవారు. ఇప్పుడు ఆ ఆనవాయితీ పూర్తిగా మారిపోయింది. నెల 10 తర్వాత జీతాలు పడుతున్నాయి. గత కొద్ది నెలలుగా అదికూడా గగనంగా మారింది. డ్రాయింగ్ అధికారులు సకాలంలోనే బిల్లులు పెట్టినప్పటికీ జీతాలు పెండింగ్‌లో పెడుతున్నారు. టోకెన్ నెంబర్ ఆధారంగా ఖజానా కార్యాలయాల్లో చెక్ చేస్తే నిధులు లేవని చూపిస్తుందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇది ఇలా ఉంటే వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల కు జనవరి నెల జీతం మార్చి లో ఇస్తారని సందేశం అందింది.


అప్పులు పుట్టాలని ఉద్యోగుల పూజలు?

ప్రతి నెల తనకు వచ్చే వేల రూపాయల జీతం కోసం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయలు అప్పు పుట్టాలని పూజలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి వచ్చే మంగళవారాల కోసం వేలాదిమంది ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. మంగళవారం జరిగే బాండ్ల వేలంలో అప్పు పుడితే తమకు జీతాలు వస్తాయన్న ఆశతో ఉంటామని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే ప్రతి మంగళవారం ప్రభుత్వం అప్పు తెస్తున్నా తమకు జీతాలు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుట్రలు సాగనివ్వం : ఏలూరి సాంబశివరావు

అధికార పార్టీ కుట్రలను సాగనివ్వబోమని బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మూడు రోజుల నుంచి ఏదో విధంగా సభను భగ్నం చేయాలని వైసీపీ ప్రయత్నాలను చేస్తూనే ఉందని ఆరోపించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను సభ సాక్షిగా అధినేత చంద్రబాబు ఎండగట్టనున్నారని తెలిపారు. బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రా.. కదిలిరా సభకు అద్దంకి నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే రవికుమార్ పిలుపునిచ్చారు.

నేడే రా కదలిరా



- ఇంకొల్లులో సభకు ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- తారక రామ విజయభేరి ప్రాంగణంలో సర్వం సిద్ధం

ఇంకొల్లు, అద్దంకి, పర్చూరు/ బాపట్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఇంకొల్లులో శనివారం రా..కదలిరా సభకు భారీ ఏర్పాట్లు చేశారు. టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడంతో పాటు వైసీపీ దుర్మార్గ పాలనను అంతమొందించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు టీడీపీ అధినేత ఈ సభ ద్వారా వివరించనున్నారు. పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు పావులూరు రోడ్డులో మధ్యాహ్నం 3 గంటలకు రా కదలిరా సభ జరగనుంది. తారకరామ విజయభేరికి దాదాపు 25 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, కొండపి ఎమ్మెల్యే స్వామి తదితర నేతలతో కలిసి సభా ప్రాంగణంలో పనులను శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్యవేక్షించారు. సభ విజయవంతానికి టీడీపీ, జనసేన నేతలు నియోజకవర్గాల వారీగా సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రెట్టించిన ఉత్సాహంతో టీడీపీ, జనసేన కార్యకర్తలు కదలివెళ్లడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. భారీ ఎత్తున స్టేజి నిర్మాణంతో పాటు ప్రాంగణంలో భోజనం, మంచినీరు, వాహన పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సభకు నాలుగు మూలల వాహనాల పార్కింగ్‌కు స్థలాలు కేటాయించారు. పర్చూరు నియోజకవర్గం మొత్తం పసుపు తోరణాల తో కళకళ లాడుతోంది. పావులూరుకు వెళ్లే రహదారి ఇరు వైపులా చంద్రబాబుకు స్వాగతం పలికే ఫ్లెక్సీలతో ముస్తాబు చేశారు. శనివారం ఉదయం నుంచే సభా ప్రాంగణం వద్ద కళాకారులు ఆటపాటలతో అలరించ నున్నారు. గ్రామాల వారీగా రవాణా కోసం కావాల్సిన సౌకర్యాల విషయంలో నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు లక్షన్నర మంది పైనే సభకు హాజరు కావచ్చని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. బాపట్ల జిల్లా నేతలతో పాటు ఉమ్మడి ప్రకాశం నేతలు కూడా సభకు హాజరుకానున్నారు.


సిద్ధమవుతున్న సభా వేదిక

పర్చూరు ఇన్‌చార్జి.. బాలాజీ

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన ఎన్నారై ● ఆ వెంటనే కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన ● మాజీ ఎమ్మెల్యే ఆమంచి అనుచరుల్లో అయోమయం


సీఎం జగన్‌కు బొకే అందజేస్తున్న యడం బాలాజీ

చీరాల, ఫిబ్రవరి 16: పర్చూరు నియోజకవర్గ తెరపైకి ఎన్ఆర్ఐ యడం బాలాజీ వచ్చారు. పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిగా బాలాజీకి సీఎం జగన్ ఆమోదముద్ర వేశారు. దీంతో వచ్చే ఎన్నికల్లో పర్చూరు వైసీపీ అభ్యర్థి బాలాజీ అని చెప్పకనే చెప్పినట్లైంది. అంతకముందు బాలాజీ శుక్రవారం సీఎం జగన్‌ను కలిశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే ఆమంచి అనుచరులు ఆయోమయంలో పడ్డారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. చీరాల, పర్చూరు రాజకీయాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. వైసీపీ పర్చూరు ఇన్‌చార్జిగా ఉన్న రావి రామనాథంబాబు స్థానంలో చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించే సమయంలో కూడా పలు నాటకీయ పరిణామాల తర్వాత కొలిక్కి వచ్చిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అప్పట్లో ఆమంచి నియామకాన్ని వ్యతిరేకించారు. అయితే కాపు సామాజికవర్గానికి చెందిన మరో వ్యక్తిని సూచించాలని జగన్ చెప్పినప్పుడే బాలాజీ పేరు ప్రస్తావనకు వచ్చింది. ఆ తర్వాత నెలకొన్న పరిణామాల నేపథ్యంలో బాలినేని అనుచరగణం ఆమంచిని పూర్తిస్థాయిలో వ్యతిరేకించింది. ఆ పంచాయితీ జగన్ దృష్టికి కూడా వెళ్లింది. అయితే ఇటీవల ఆమంచి తన అనుచరులకు తాను చీరాల నుంచే పోటీ చేస్తానని చెప్పారు. ఆ క్రమంలో పార్టీ పెద్దలతో పాటు సీఎం జగన్ కూడా పర్చూరుపై ప్రత్యేక దృష్టి సారించారు.

సొంత గూటికి చేరిన బాలాజీ

బాలాజీ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో చీరాల నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. తర్వాత 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన కరణం బలరామకృష్ణమూర్తితో కలసి పనిచేశారు. అయితే ఆ తర్వాత ఎమ్మెల్యే బలరాం వైసీపీకి మద్దతు తెలపగా ఆయన తనయుడు వెంకటేష్ వైసీపీ చీరాల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు బాలాజీని చీరాల టీడీపీ ఇన్‌చార్జిగా నియమించారు. అయితే వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ ఎన్నికల సందర్భంగా నెలకొన్న పరిస్థితులతో బాలాజీ కొంతకాలం క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తర్వాత అమెరికా వెళ్లారు. తాజాగా బాలాజీ శుక్రవారం సీఎం జగన్‌ను కలవడంతో తిరిగి సొంత గూటికి చేరినట్లైంది. ఈ క్రమంలో బాలాజీని వైసీపీ ఇన్‌చార్జిగా ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

నియోజకవర్గంలో ఆమంచి.. జగన్ దగ్గర బాలాజీ

వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం నియోజకవర్గ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్చూరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులతో కలసి యడం బాలాజీ సీఎం జగన్‌ను కలిశారు. ఇప్పటికే చీరాల వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ అని పార్టీ పెద్దలు స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో ఇక చీరాల నుంచి ఆమంచి పోటీ అంటే ఏ పార్టీలో అవకాశం వస్తుందో, అవకాశం వచ్చిన పార్టీకి ఏ మేర ఆదరణ ఉంటుందనే అంశంపై ఆయన వర్గీయులు కూడికలు, తీసివేతలు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అనంతకు.. ఆర్టీసీ క్యూ

వైసీపీ సిద్ధం సభకు 292 బస్సులు

- డిపోల్లోని సగం బస్సుల కేటాయింపు
- ప్రయాణికులకు మూడు రోజులు తిప్పలే
- ప్రైవేటు వాహనాల బాట పట్టక తప్పని పరిస్థితి




గుంటూరు, ఫిబ్రవరి 16: వైసీపీ సేవలో ఆర్టీసీ తరిస్తోంది. వైసీపీ సభ అంటే ఆర్టీసీ అధికారులు ఎక్కడలేని ఉత్సాహంగా బస్సులను కేటాయిస్తున్నారు. సాధారణంగా సభ జరిగే ప్రాంతం లో లేదంటే ఆ సమీపంలోని డిపోల నుంచి బస్సులను కేటాయి స్తుంటారు. కానీ కొంతకాలంగా ఎక్కడ సభ జరిగినా రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను తరలిస్తున్నారు. ఆయా సందర్భాల్లో డిపోల్లో బస్సులు లేక రోజువారీ ప్రయాణాలకు సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించు కోవడం లేదు. ప్రయాణికుల నుంచి నిరసనలు, విపక్షాల నుంచి విమర్శలు ఎదురైనా ఆర్టీసీ యాజ మాన్యం అధికార వైసీపీ సేవలో తరిస్తోంది. అడిగిందే తడవుగా బస్సులను సమకూరుస్తూ ప్రయాణికులను గాలికివదిలేస్తోంది. తద్వారా ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరాలంటేనే ముప్పతిప్పలు పడాల్సి వస్తున్నా అటు అధికారులు, ఇటు వైసీపీ నాయకులకు పట్టడంలేదు. గురువారం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో వలంటీర్లకు వందనం పేరిట ముఖ్యమంత్రి సభకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించారు. ఈ కారణంగా గురువారం అంతా కూడా ఆయా డిపోల పరిధిలో సర్వీసులు లేక ప్రయా ణాలకు సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. ఇంతలోనే అనంతపురంలో ఆదివారం జరిగే వైసీపీ సిద్ధం సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డిపోల నుంచి సగం సర్వీసులను కేటాయించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ డిపోల నుంచి 292 బస్సులను సిద్ధం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 100, పల్నాడు జిల్లాలోని ఆరు డిపోల నుంచి 129, బాపట్ల జిల్లాలోని నాలుగు డిపోల నుంచి మరో 63 సర్వీసులను అనంతపురానికి పంపాలను ఆయా డిపోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అనంత సభకు తరలించే బస్సులు పూర్తి కండీషన్ లో ఉండాలని, ఎటువంటి లోపాలు లేకుండా ముందుగానే చూసుకోవాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. సభ 18న అయినప్పటికీ 17న ఉదయం నుంచే బస్సులు అనంతపురానికి తరలించాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అసలే అరకొరగా సర్వీసులో ఉన్న కండీషన్ బస్సులను సిద్ధం సభకు తరలించడంతో మిగిలిన డొక్కు సర్వీసులను ప్రయాణికులకు వినియోగిస్తున్నారన్న విమర్శలున్నాయి. శనివారం నుంచే సిద్ధం సభకు ఆర్టీసీ సర్వీసులు మొత్తం 292 సర్వీసులు తరలించనున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. తిరిగి సోమవారం రాత్రికి బస్సులు డిపోలకు చేరుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో శనివారం ఉదయం బయల్దేరే బస్సులు తిరిగి సోమవారం డిపోలకు చేరే అవకాశం ఉంది. ఈ క్రమంలో శనివారం నుంచి సోమవారం వరకు ఆయా డిపోల పరిధిలో బస్సులు అందుబాటులో ఉండవు. అంటే ఈ మూడు రోజులు ప్రయాణాలకు సామాన్యులు ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సిందే. శని, ఆది, సోమవారం మూడు రోజుల పాటు ఆర్టీసీ ప్రయాణికులకు ప్రయాణ భారం తప్పని పరిస్థితి నెలకొన్నది. ప్రైవేటు వాహనాల బాట పట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది..



తుది జాబితాలోనూ..

మృతులకు ఓట్లు

- తప్పులు సరి చేయకుండానే కొనసాగింపు
- ఈసీ ఆదేశాలను పట్టించుకోని ఎన్నికల అధికారులు



పడమర బాపట్ల 42వ పోలింగ్ బూత్‌లో మృతుల ఓట్లు ఉన్న జాబితా

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 16: ముసాయిదా ఓటర్ల జాబితాలో నెలకొన్న తప్పులను సరి చేసి తుదిజాబితా రూపొందించాలి.. ఎటువంటి తప్పులు పునరావృతం కాకూడదు అని ఎన్నికల సంఘం ఆదేశాలను స్థానిక ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని అర్థమ వుతోంది. ముసాయిదా జాబితాలో దొర్లిన తప్పులను అలాగే ఉంచి తుది జాబితాలను విడుదల చేశారు. ఇటీవల విడుదల చేసిన తుదిజాబితాలోని తప్పులను గుర్తించిన వారు ఎన్నికల సంఘం ఆదేశాలు క్షేత్ర స్థాయిలో ఆచరణకు నోచుకోలేదని అర్థమవు తోంది. మృతి చెందినవారి ఓట్ల పేర్లు తుది ఓటర్ల జాబితాలోనూ కొనసాగుతున్నాయి. ఏటా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఓటర్ల జాబితాలో అధికారులు సవరణలు చేస్తూనే ఉన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనలో క్షేత్రస్థాయి సిబ్బంది శ్రద్ధ తీసుకోకపోవడంతో మృతుల ఓట్లు, ఒకరికే రెండేసి ఓట్లు ఉన్నాయి. బాపట్ల మండలంలోని పలు గ్రామాలలో మృతులు ఓటర్లుగా కొనసాగుతున్నారు. బాపట్ల మండలం పడమరబాపట్ల పంచాయతీ 42వ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో మృతుడు దొంతిన రామిరెడ్డి క్రమసంఖ్య 44, ఓటరు ఐడీ ఎస్ఎస్‌వై 1713585, మృతుడు నక్కా వెంకటేశ్వర్లు క్రమసంఖ్య 86 ఐడీ ఎస్ఎస్‌వై 1713478, ఈతేరు పంచాయతీలోని పోలింగ్‌బూత్ 5లో 8మంది మృతులు ఓటర్లుగా కొనసాగుతున్నారు. ఇదే పోలింగ్ కేంద్రంలో క్రమ సంఖ్య 41, 42లో నత్తల హర్షవర్ధన్ పేరు పక్కపక్కనే రెండు ఓట్లు నమోదై ఉంది. క్రమసంఖ్య 714, 1067 నెంబరుపై అందే రాఘవ సృజన్, క్రమసంఖ్య 1085, 1016 నెంబరుపై మాదాసు తరణ్, క్రమసంఖ్య 850, 852పై యల్లా ప్రగడ ప్రత్యూష పేర్లతో రెండేసి ఓట్లు జాబితాలో ఉన్నాయి. గుర్తించిన తప్పులను చూసిన ప్రతిఒక్కరూ ఎన్నికల అధికారులపై మండిపడుతున్నారు. కావాల్సినంత గడువు తీసుకున్నా తప్పులు సరిచేయకుండానే జాబితాలను రూపొందించారని ఆరోపిస్తున్నారు.

ఇంకొల్లు సభకు భారీగా తరలిరండి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక, అరాచకపాలన అంతంకోసం పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో శనివారం జరిగే రా.. కదలిరా సభకు అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు అధికంగా తరలిరావాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ నాయకుడు దగ్గుమల్ల ప్రసాదరావు విజ్ఞప్తిచేశారు. తెలుగుదేశం, జనసేనల ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో చంద్రబాబునాయుడు పాల్గొంటున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రజావ్యతిరేక పాలనలో చోటుచేసుకున్న అనేక దుర్మార్గపు నిర్ణయాలను చంద్రబాబు వెల్లడిస్తారని వాటిని స్వయంగా విని అర్ధంచేసుకోవాలని కోరారు. చినగంజాం మండలానికి చెందిన ప్రసాదరావు ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఇటీవల టీడీపీలో చేరారు. బాపట్ల నియోజకవర్గ టీడీపీ నాయకునిగా వివిధ అంశాలను పర్యవేక్షిస్తున్న ఆయన బాపట్ల లోక్‌సభ నుంచి ఎంపీగా పోటీ చేసే ఉద్దేశంతో ముందుకుసాగుతూ చురుకైన నాయకుడిగా పనిచేస్తున్నారు.

ఏటీఎంలో నగదు తేడా.. పోలీసులు కేసు నమోదు

అద్దంకి, ఫిబ్రవరి 16: ఏటీఎం మిషన్‌లలో క్యాష్ పెడుతూ 15.77 లక్షల రూపాయలు వ్యత్యాసం రావటం తో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు హిటాచ్ ఏజెన్సీ ద్వారా కరూర్ వైశ్యాబ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ కు సంబంధించిన ఏటీఎంలలో క్యాష్ పెడుతుంటారు. ఈక్రమంలో అద్దంకి మండలం కొంగపాడుకు చెందిన దావీద్, వినోద్‌లు ఎజెన్సీలో క్యాష్ ఏర్పాటు చేసే సిబ్బందిగా పనిచేస్తున్నారు. ఏటీఎంలలో క్యాష్ పెట్టే సమయంలో గత కొంతకాలంగా పక్కా ప్లాన్‌తో కొంత మొత్తాన్ని తగ్గించి పెడుతూ, ఆ మొత్తాన్ని తమ సొంతానికి వాడుకుంటున్నారు. అనుమానం వచ్చిన ఎజెన్సీ ప్రతినిధులు విచారణ చేపట్టగా వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. మొత్తం 15.77 లక్షల రూపాయలు లావాదేవీలు తేడా ఉన్నాయి. ఏజెన్సీ ప్రతినిధి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

రైతుల ఉసురుతో జగన్‌రెడ్డి పతనం ఖాయం

- ఓటమి భయంతో వైసీపీ విపరీత పోకడలు
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, ఫిబ్రవరి 16: అమరావతి రైతుల కన్నీటి ఉసురుతో జగన్‌రెడ్డి పతనం ఖాయమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ విపరీత పోకడలకు తెరలేపిందని ఆయన ధ్వజమెత్తారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్ధలయ్యాయన్నారు. రాజధాని విషయంలో జగన్ చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపించారన్నారు. ఒక పాలకుడి కుట్రలతో ప్రజారాజధాని ఎలా విధ్వంసం అయిందో చూపించారన్నారు. వేల కోట్ల ప్రభుత్వ సంపద ను ఎలా నాశనం చేశారో, రైతులు, మహిళల పట్ల ఎంత దారుణంగా వ్యవహరించారో అనే నిజాలు ఈ సినిమా ద్వారా ప్రజలలోకి వెళతాయనే భయంతో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అడుగడుగునా సినిమాను అడ్డుకునేందుకు అన్ని రకాల కుట్రలు చేశారన్నారు. సినిమాలో పెద్ద నటులు నటించకుండా అడ్డుకున్నారన్నారు. గతంలో మూడు రాజధానుల విషయంలో ఏం జరిగిందో చూశామని, ఇప్పుడు రాజధాని సినిమా విషయంలోనూ అదే చేస్తున్నారన్నారు. సీఎం వందల కోట్లు పెట్టి ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం చేయటం అనేది అమరావతి విషయంలో చూశామన్నారు. జగన్‌రెడ్డి అమరావతి విధ్వంసం వల్ల రాష్ట్రం లక్షల కోట్ల సంపద నష్టపోయింది వాస్తవం కాదా అని ఎమ్మెల్యే రవికుమార్ ప్రశ్నించారు. జగన్ సినిమా అయిపోయిందన్నారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో వైసీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని ప్రజలకు చూపే రాజధాని ఫైల్స్ సినిమా మళ్ళీ మొదలైందని ఎమ్మెల్యే అన్నారు.

శింగరకొండలో రథసప్తమి పూజలు

అద్దంకి, జనవరి 16: రథసప్తమి సందర్భంగా శింగరకొండలో శుక్రవారం సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో సుభద్ర, పూజారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అద్దంకిలోని పలు దేవాలయాలలోనూ పూజలు నిర్వహించారు.

చీరాల: వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పార్వతీపురంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం పంచవటి రామలింగేశ్వరస్వామి శివశక్తి పీఠం క్షేత్రం 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గన్నవరం వైసీపీ నాయకులు



ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ గన్నవరం నేతలు

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 16: యద్దనపూడి మండలం గన్నవరంకు చెందిన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం సాయంత్రం మండలంలోని ఇసుకదర్శిలోగల ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సగౌరవంగా ఏలూరి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ యద్దనపూడి మండల అధ్యక్షు డు నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, సురేంద్ర, కుమారస్వామి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ దూళిపాళ్ల హరిబాబు, దూళిపాళ్ల సుబ్బారావు, ఉసిరిపాటి సురేష్, పల్లెపోగు పెదనాగేశ్వరరావు, అద్దేపల్లి యాకోబు, పఠాన్ బాజి, మురికిపూడి అంజయ్య తదితరులు ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఎమ్మెల్యే రవికుమార్‌కు సంఘీభావం తెలుపుతున్న తూర్పు కొప్పెరపాడు వైసీపీ నేతలు

పంగులూరు, ఫిబ్రవరి 16: మండలంలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో వైసీపీకి చెందిన ప్రధాన నేతలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు సంఘీభావం తెలిపారు. శుక్రవారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో సర్పంచ్ ఎనికపాటి కళ్యాణి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు పూనాటి రామాంజనేయులు (శింగర్), మాజీ సర్పంచ్ చాతరాజుపల్లి పూర్ణబాబు, మాజీ ఎంపీటీసీ ఎడ్లూరి పెదనల్లయ్య, తదితరులు రవికుమార్‌ను కలసి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం, వైసీపీ పాలనలో అంధకారంలోకి నెట్టబడిన రాష్ట్రానికి పునర్ వైభవం తీసుకువచ్చేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఓటర్ల జాబితా విషయంలో అప్రమత్తంగా ఉండాలని తనను కలసిన నేతలకు దిశా నిర్దేశం చేశారు.

'సీఎం చేపట్టే ప్రతి చర్య ప్రజావ్యతిరేకమే'

చీరాల, ఫిబ్రవరి 16: సీఎం జగన్ చేపట్టే ప్రతి చర్య ప్రజావ్యతిరేకమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీఅమరనాథ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని ఫైల్స్ సినిమాతో ఒణుకు ప్రారంభమయ్యిందన్నారు. ఆ సినిమా ప్రదర్శనకు హైకోర్టు అనుమతి ఇవ్వటంతో సీఎం జగన్‌కు మరోదెబ్బతిన్నారని అన్నారు. సమావేశంలో నాయకులు కొతవరపు జనార్దనరావు, కొమ్మనబోయిన రజని, గంజి పురుషోత్తం, దోని కనకరాజు, అనపర్తి రత్నబాబు, ఎరిపిల్లి అప్పారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక


చినగంజాం, ఫిబ్రవరి 16: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 18వ తేది మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ ఆర్గనైజేషన్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ జట్ల ఎంపిక కార్యక్రమంలో పాల్గొనే బాల బాలికల బరువు 55 కేజీల లోపు ఉండాలని తెలిపారు. మార్చి 19,2008 తర్వాత పుట్టిన వారై ఉండాలని, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 6301015775, 9966986373 నెంబర్లను సంప్రదించాలని పుల్లయ్య కోరారు.


ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లు స్వాధీనం

చినగంజాం, ఫిబ్రవరి 16: ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఆరు టిప్పర్లు, రెండు ఎక్స్‌కవేటర్లు, నెంబరు లేని ఒక ద్విచక్రవాహనాన్ని శుక్రవారం పట్టుకొని పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎం.సుబ్బారావు తెలిపారు. చినగంజాం సర్వే నెంబర్లు 828, 829లోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవణా చేస్తున్నారు. అందిన సమాచారం మేరకు తహసీల్దార్ ఫణీంద్రబాబు ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ ఎం.సుబ్బారావు, చినగంజాం, మోటుపల్లి, పెదగంజాం గ్రామ రెవెన్యూ అధికారులు బండారు దానియేలు, ఆమంచి సత్యనారాయణ, మునీర్, షేక్ బాషా, వీఆర్‌ఏలు ఇసుక క్వారీల్లో అనుమతులు లేకుండా ఇసుక నింపుకున్న మూడు టిప్పర్ల, ఇసుకను నింపుకోవడానికి వచ్చిన మూడు టిప్పర్లు, రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీటీ తెలిపారు. పట్టుకున్న వాహనాలను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీఆర్వో దానియేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న కంపెనీపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి



సోమశిలలో 20.953 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 16: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శుక్రవారం నాటికి జలాశయంలో 20.953 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

వైభవంగా రథసప్తమి

- వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వేలాదిమంది సముద్రస్నానానికి...
- శ్రీవార్లకు సప్తవాహన సేవలు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 16 : జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు సముద్ర స్నానాలకు భారీగా తరలి వెళ్లారు. మైపాడు, కోడూరుపాడు, కంటేపల్లి, ఇస్కపల్లి, రామతీర్థం, తదితర ప్రాంతాల్లోని సముద్ర తీరంలో పెద్ద సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు చేసి, సూర్య నమస్కారాలు చేశారు. నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి, పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో తిరుమల తరహాలో సప్తవాహన సేవలు జరిగాయి. అలాగే వేదగిరి లక్ష్మీనరసింహస్వామికి సూర్యప్రభ వాహనంపై గిరిప్రదక్షిణ జరిగింది. కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనసేవలు జరిగాయి. అలాగే అన్ని మండలాల్లోని వైష్ణవ ఆలయాల్లో ఉదయం రథసప్తమి పూజలు, సూర్యప్రభ వాహన సేవలు జరిగాయి. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

రాపూరు(డక్కిలి) : పెంచలకోనలోని నృసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం 6 గంటలకు సూర్యప్రభ సేవ, 8 గంటలకు శేషవాహన సేవ, 10కి సింహవాహన సేవ, 12కి బంగారు గరుడసేవ, రెండుకి చక్రస్నా నం, నాలుగుకు హనుమంతసేవ, సాయంత్రం ఆరుకి చంద్ర ప్రభ వాహన సేవలు జరి గా యి. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప క మిషనర్ కేవీ సాగర్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బుచ్చిరెడ్డిపాళెం : రథసప్తమి సందర్భంగా శుక్రవారం భక్తులు శిరసున, భుజాలపైన జిల్లేడు ఆకులు ఉంచుకుని పెన్నాలో స్నానాలు చేశారు. అనంతరం జొన్నవాడ ఆలయంలో కామాక్షితాయిని దర్శించుకున్నారు.



రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న నెల్లూరు రంగనాయకుల స్వామి



కావలిలో గరుడ వాహనసేవ అందుకుంటున్న శ్రీవారు



రంగడి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



రంగనాథుడికి నిర్వహించిన చక్రస్నానం



పెంచలకోనలో చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నృసింహుడు

- ప్రసన్నుడి ఆలయంలో..

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు, కళ్యాణాచార్యులు ఉదయం శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో సూర్యప్రభ వాహనంపై ఉత్తర ముఖంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారికి చంద్రప్రభ వాహన ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.



కొండబిట్రగుంటలో సూర్యప్రభ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అలా ఎలా కుదురుతుందబ్బా ?

- ఒంగోలులో ఉద్యోగం.. నెల్లూరులో ఎన్నికల విధులు

నెల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులన్నీ జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది ద్వారా మాత్రమే జరగాలి. అయితే ఈ సారి పక్క జిల్లా అధికారులకు జిల్లాలో ఎన్నికల విధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆర్అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎన్ దామోదర్‌రావు ఏడాదన్నర క్రితం ఒంగోలుకు బదిలీ అయ్యారు. అయితే ఆ అధికారిని ఇప్పుడు నెల్లూరు నగర నియోజకవర్గానికి సంబంధించి ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా నియమిస్తూ నగర రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ కలెక్టర్ ఎం హరినారాయణన్‌కు పంపిన రిపోర్ట్ ఒకటి వెలుగుచూసింది. ఈ విషయాన్ని సీనియర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జిల్లాలో ఎన్నికల విధులు అప్పగించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. మరి దామోదరరావును ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆఫీసర్‌గా ఎలా నియమించారో ? సంబంధిత అధికారులే సమాధానం చెప్పాలి.

మిన్నంటిన నిరసన గళం

- మద్దతు ధర చట్టం తీసుకురావాలంటూ ప్రదర్శన
- కార్మికులకు నెలకు రూ.26 వేతనం ఇవ్వాలని డిమాండ్
- ప్రశాంతంగా గ్రామీణ, పారిశ్రామిక సమ్మె



ఉదయగిరిలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 16 : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ దేశ వ్యాప్త గ్రామీణ, పారిశ్రామిక బంద్‌లో భాగంగా శుక్రవారం నెల్లూరు నగరంలో నిరసన ప్రదర్శన జరిగింది. కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి ప్రదర్శనలో పాల్గొన్నారు. నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్‌లోని స్వతంత్ర పార్క్ నుంచి ప్రదర్శన ప్రారంభమై అంబేడ్కర్ విగ్రహం మీదుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం అక్కడ జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతుంటే, కేంద్రం మొండివైఖరి అవలంభిస్తున్నదని విమర్శించారు. ఇందుకు నిరసనగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతాంగం, పట్టణాల్లోని కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొన్నారని తెలిపారు. 23 పంటలకు కాకుండా అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో రూ. 12 లక్షల కోట్లు రుణాల మాఫీ జరిగి, ఎంతోమంది ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారని తెలిపారు. ఈ క్రమంలోనే గిట్టుబాటు ధర లభించని రైతులు తీసుకున్న రుణాలు చెల్లించలేక 1.60 లక్షల మంది ఆత్మహ త్యలు చేసుకు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ పరిశ్రమల్లో తయారయ్యే వస్తువు లకు ఎమ్మార్పీ ఉండగా రైతులు పండించిన ధాన్యానికి ఎందుకు ఎమ్మార్పీ లేదని ప్రశ్నించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ 150 మంది ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులను హడావిడిగా సస్పెండ్ చేయడం, రూ. 60 లక్షల కోట్ల రవాణా రంగాన్ని కార్పొరేట్ చేతిలో పెట్టేందుకేనన్న అనుమానం కలుగుతున్నదని దుయ్యబట్టారు. పారిశ్రామిక రంగ కార్మికులకు నెలకు రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంక టేశ్వర్లు మాట్లాడుతూ కౌలు రైతు పంటలకు రుణాలతో పాటు భూయజమానితో సంబంధం లేకుండా పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర నాయకులు కిశోర్ బాబు, జిల్లా అధ్యక్షుడు సాగర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లయ్య, జొన్నలగడ్డ వెంకటరాజు, షాన్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.



కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు



నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్నవామపక్ష, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు



సైదాపురం : బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

బర్డ్ ఫ్లూతో అప్రమత్తం

- జిల్లాలో 37 రాపిడ్ రెస్పాన్స్ టీముల ఏర్పాటు
- కిలోమీటరు ప్రాంతం ఇన్ఫెక్టెడ్ జోన్
- 10 కి.మీ ప్రాంతం సర్వేలెన్స్ ఏరియా
- అనుమానం వస్తే 1962 టోల్ ఫ్రీకి కాల్ చేయండి
- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 16: ఊహించిందే నిజమైంది... జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ కలకలమంటూ అధికారులను ఆంధ్రజ్యోతి ముందే హెచ్చరించింది. అప్రమత్తమైన అధికారులు మృతిచెందిన కోళ్ల కళేబరాల నుంచి నమూనాలను సేకరించి, ల్యాబ్‌లో పరిశీలించగా బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ ప్రబలిన గ్రామాలకు కిలోమీటరు ప్రాంతం మొత్తాన్ని ఇన్ఫెక్టెడ్ జోన్‌గా ప్రకటించింది. పోలీసు, రెవెన్యూ, అటవీ, పశుసంవర్ధక శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి 37 రాపిడ్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేశారు. వ్యాధి నివారణ చర్యల్లో ఈ టీములు నిమగ్నమయ్యాయి. పొదలకూరు మండలం చాటగొట్ల, కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ గ్రామాలకు 10 కి.మీ ప్రాంతాన్ని సర్వేలెన్స్ ప్రాంతంగా ప్రకటించి కోళ్లు, కోళ్ల ఉత్పత్తుల రాకపోకలను కట్టడి చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఆయా ప్రాంతాల్లో ఎలాంటి కోళ్ల మరణాలు నమోదు కాలేదని ప్రభుత్వం ప్రకటించింది. ఓ పశువైద్య నిపుణుడు, ఇద్దరు పశుసం వర్ధక సహాయకులు, ఇద్దరు వైద్యశాల అటెండర్‌లతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేశామని పశుసంవర్ధకశాఖ కమిషనర్ పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ పూర్తిగా అదుపులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అనుమానం కలిగితే 1962 టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు.



10వతేదీ ప్రచురితమైన కథనం

చాటగొట్లలో శానిటేషన్

- జిల్లా అధికారుల పర్యటన

పొదలకూరు, ఫిబ్రవరి 16: మండలంలోని చాటగొట్ల గ్రామంలోని కోళ్లఫారం వద్ద శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సుస్మితారెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి, ఏడీ అరుణ, డాక్టర్లు శిరీష, రాధిక, మురళీకృష్ణారెడ్డి, సీఐ రాంబాబు కలిసి శానిటేషన్ చేయించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, పౌల్ట్రీ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కోళ్లు మరణించిన ప్రాంతానికి 10 కిలోమీటర్ల పరిధిలో మూడు రోజులపాటు చికెన్ షాపులను మూసివేయాలని తెలిపారు. కిలోమీటరు పరిధిలో మూడు నెలల వరకు చికెన్ షాపులను తెరవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఆయా ప్రాంతాల నుంచి 15రోజుల వరకు కోళ్లు బయట ప్రాంతాలకు డెలివరీ చేయకుండా, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి కోళ్లను తీసుకురాకుండా చేయాలన్నారు. వ్యాధితో మరణించిన కోళ్లను భూమిలో పాతిపెట్టాలని తెలిపారు. అనంతరం ఆమె పట్టణంలోని చికెన్ దుకాణాలను మూయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వెటర్నరీ అధికారులు, పోలీసులు, కోళ్లఫారాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



పొదలకూరు మండలం చాటగొట్ల కోళ్లఫారం సమీపంలో డీపీవో, వెటర్నరీ అధికారులు

కోవూరులో చికెన్ అమ్మకాల నిషేధం : జడ్పీ సీఈవో



కోవూరు మండలం గుమ్మళ్ళ దిబ్బ కాలనీలో పర్యటిస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

కోవూరు, ఫిబ్రవరి 16: కోవూరు పంచాయతీ పరిసర ప్రాంతాల్లో పది రోజులపాటు కోడిమాంసం అమ్మకాల్ని నిషేధించినట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిన గుమ్మళ్ళదిబ్బ కాలనీని శుక్రవారం పంచాయతీరాజ్, పశుసంవర్ధక, రెవెన్యూశాఖాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కోవూరు మజరా గుమ్మళ్లదిబ్బ కాలనీకి 10 కి.మీ మేర మూడు రోజులు కోడిమాంసం అమ్మకాల్ని నిషేధించినట్లు చెప్పారు. నిబంధనల్ని అతిక్రమించి కోడిమాంసం విక్రయాలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బర్డ్‌ఫ్లూతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఆర్‌బీకేలో ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం అధికారులు గుమ్మళ్ళదిబ్బ కాలనీలోని ఇంటింటికీ తిరిగి విచారణ చేపట్టారు. ఎవరింట్లో ఎన్ని కోళ్ళున్నాయో గుర్తించారు. ఎన్ని కోళ్లు మృతి చెందాయో తెలుసుకున్నారు. దీంతో పలువురు తాము పెంచుకుంటున్న కోడిపుంజుల్ని పొలాల్లోకి తీసుకువెళ్లారు. కోళ్ల పెంపకందారులు తమ కోళ్లను పలుచోట్ల దాచేశారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన కాలనీలోని వ్యర్థాల్ని తొలగించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై వామపక్షాల నిరసన



కందుకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు



ఆత్మకూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

కావలి, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్‌మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా కార్మిక సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో కావలి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక ఏరియా వైద్యశాల నుంచి గాంధీబొమ్మ, కోర్టుసెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి తిరిగి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఉదయగిరి రోడ్డు సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పసుపులేటి పెంచలయ్య, జీ. మధుసూదనరావు, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కే.నాగరాజు, ఎల్ లక్ష్మీరెడ్డి, శ్యామల, క్రిష్ణమోహన్, జాన్, చిన్ని, రాజగోపాల్, నరసింహారావు, కార్మికసంఘాల నాయకులు తన్నీరు వెంకటేష్, మల్లె అంకయ్య, గుంజి కిషోర్, తురక శీనయ్య, టీ.పోలయ్య పాల్గొన్నారు.

కందుకూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతులు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన గ్రామీణ బంద్‌లో భాగంగా శుక్రవారం కందుకూరులో ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతులు, కార్మికులతో కలిసి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బీ.సురేష్‌బాబు, ఎస్‌ఏ గౌస్, వై.ఆనంద్‌మోహన్, రామమూర్తి, ఉప్పు వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి రాము, ఎం. పద్మ, డీఎం రాయుడు, నీలిశెట్టి నరసయ్య, కాకుమాని రమణమ్మ, మెండా మహేంద్ర, పులి నాగేశ్వరరావు, దార్ల శేషమ్మ, రమేష్ పాల్గొన్నారు.

లింగసముద్రం : మండలంలో చేపట్టిన గ్రామీణ భారత్ బంద్‌కు సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీ వర్కర్లు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ రమాదేవి, సీహెచ్ ప్రభావతి, ప్రమీల, షేక్ ఫరీమా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చింతా సుధాకర్, రవి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: కేంద్ర ప్రభుత్వంలోనూ రాష్ట్ర ప్రభుత్వంలోనూ పేదల జీవితాలు ఛిద్రమైపోతున్నాయని సీపీఎం మండల అధ్యక్షుడు పాటి భాస్కర్ అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అల్లూరులో శుక్రవారం సమ్మె కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, రషీద్, ఏడుకొండలు, శ్రీను, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు: గుడ్లూరులో సీఐటీయూ, సీపీఎం, ప్రజాసంఘాల అధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం దగ్గర నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, నాయకులు మద్దిశెట్టి జాలయ, వల్లెపు కొండయ్య దామా కృష్ణయ్య, పొందూరి కొండమ్మ, ఎం. వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాదర్ బాషా, సుంకరి విజయలక్ష్మి, గుత్తి స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని జిల్లా నాయకులు మాదాల రమణయ్య తెలిపారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వలేటివారిపాలెం స్టేట్‌బ్యాంక్ ముందు సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, సుబాను అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, చెంచులక్ష్మి, వరలక్ష్మి, సుజాత, ప్రశాంతి, సలోమి, సుభాషిణిపాల్గొన్నారు.

బిట్రగుంట: కార్మిక కర్షకుల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని మండల సీఐటీయు అధ్యక్షుడు చల్లా నరహరి అన్నారు. భవన కార్మికులు, చేతివృతుల కార్మికులతో కలసి తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ విజయకుమారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకయ్య, భవన కార్మిక సంఘం అధ్యక్షుడు బాదుల్లా, శీనయ్య, వేణు, తిరుపతిరావు, కృష్ణారెడ్డి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: ఉలవపాడులో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూయించి బంద్‌కు సహకరించాలని కోరారు. అనంతరం వినాయకుడి గుడి సెంటర్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆటో వర్కర్ల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో రైతు సంఘం, సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిఐటీయు నాయకులు జి శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య, సీపీఎం నాయకులు జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, కె డేవిడ్‌రాజు, ఏపీ రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్, కృష్ణమోహన్, ఐద్వా నాయకురాలు గుల్జార్‌బేగం, ఎల్‌ఐసీ, ఆర్టీసీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితర యూనియన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతసాగరం: సీఐటీయూ పిలుపు మేరకు కార్మికులు బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా తహసీల్దారు కార్యాలయంకు చేరుకొని ఆందోళన చేశారు. ఈసందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రం డీటీ సుజాతకు అందించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, మీరామొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం ఉదయగిరిలో భారత్‌బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కాకు వెంకటయ్య, ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీఐటీయూ నాయకులు ఫరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం, ఫిబ్రవరి 16: స్థానిక చెక్‌పోస్టు కాలనీలో ఉన్న మాతా పరమేశ్వరి ఆలయ సన్నిధిలో మాఘమాసం సందర్భంగా శుక్రవారం సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో దంపతులు వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కరుణాకరరెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు యాదవ్, శ్రీనివాసులురెడ్డి, శేషయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

అనంతసాగరం, ఫిబ్రవరి 16: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ సూచించారు. కార్యాలయంలో శుక్రవారం వీఏఏ, హార్టీకల్చర్, పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొందరు విధులకు హాజరుకాకుండా ఫీల్డు మీద ఉన్నట్లు చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల ప్రారంభం

ఆత్మకూరు, ఫిబ్రవరి 16 : మున్సిపాల్టీ పరిధిలోని 23వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి స్థానిక కౌన్సిలర్ చెరుకూరు కామక్షయ్య నాయుడుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన నెల్లూరుపాళెం సెంటర్‌లోని దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తదనంతరం విజయీభవ యాత్రలో భాగంగా నెల్లూరుపాళెంలోని ఎస్టీ, ఎస్సీ, ముస్లీం కాలనీలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ మహబూబ్‌బాషకు రూ. 50 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణ కన్వీనర్ అల్లారెడ్డి ఆనందరెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూమిని ఇప్పించాలని రైతు ఆందోళన



అగ్రిమెంటు, పాసుబుక్ చూపిస్తున్న బాధిత కుటుంబం

వింజమూరు, ఫిబ్రవరి 16: ఆక్రమణకు గురైన తన భూమిని తనకి ఇప్పించాలంటూ వింజమూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన గంజిబోయిన యమునరావు అనే రైతు తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన వ్యక్తంచేశాడు. తన తండ్రి పేరు మీద ఉన్న ఒక ఎకరా 98 సెంట్లు ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించాడని, 2006లో తన తండ్రి చనిపోతే 2012లో అగ్రిమెంట్ చేసినట్లు తప్పుడు పత్రాలను సృష్టించారని పేర్కొన్నాడు. తమ భూమి తమకు ఇప్పించకుంటే ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని తెలిపాడు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 16: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం మండలంలోని వీఆర్‌ఏలు డిప్యూటీ తహసీల్దారు కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు దుగ్గయ్య మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి విజయవాడలో ఈనెల 18, 19, 20వ తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడతామని, ప్రభుత్వం స్పందించకపోతే 20వ తేదీ అనంతరం నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు శ్రీనివాసులు, పురుషోత్తం, ఫరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం లక్ష్యాలు సాధించాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 16: ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని లీడ్‌బ్యాంకు మేనేజర్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల సభ్యులకు, రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. రుణాల రికవరీ శాతం నూరు శాతం ఉండాలన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం రవిసింగ్, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమశిల ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సోమశిల ఉద్యోగులు

అనంతసాగరం, ఫిబ్రవరి 16: సోమశిల జలాశయం సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట శుక్రవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన తెలిపారు. పెండింగ్ బాకాయిలు, జీపీఎఫ్ తదితర సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు చంద్రశేఖర్, ఉత్తయ్య, మహేశ్వరయ్య, రామయ్య, బాలగురవయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళను కాపాడిన యువకులు

అనంతసాగరం, ఫిబ్రవరి 16: మండలంలోని పాతదేవరాయపల్లిలో శుక్రవారం మతిస్థిమితం లేని జీ విజయమ్మ అనే మహిళ గ్రామ సమీపంలోని బావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. గుర్తించిన స్థానిక యువకులు నిశాంత్, నరేంద్ర, మధు బావిలోకి దిగి ఆమెను బయటకు తీసి రక్షించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి : యూటీఎఫ్



పోస్టుకార్డులు చూపుతున్న యూటీఎఫ్ నేతలు

చేజర్ల, ఫిబ్రవరి 16: పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని సీఎం జగన్ విస్మరించాడని చేజర్ల మండల యూటీఎఫ్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో సీపీఎస్‌ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీ నాయకులకు పోస్టుకార్డులు రాశారు. పాత పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చిన వారికే తమ మద్దతు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి రమణయ్య, జిల్లా కౌన్సిలర్ పోలయ్య, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిపై విచారణ



విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

సీతారామపురం, ఫిబ్రవరి 16 : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల పట్ల వ్యాయామ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని అభియోగాలు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, కావలి డిప్యూటీ డీఇవో, ఎంఈఓల ఆధ్వర్యంలో శుక్రవారం మోడల్ స్కూల్‌లో విచారణ జరిపారు. అనంతరం అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదుపై పాఠశాల సిబ్బంది, విద్యార్థుల అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని లిఖిత పూర్వకంగా నివేదికలు తయారుచేసి జిల్లా కలెక్టర్‌కి, జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించడం జరుగుతుందని, తదుపరి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డిప్యూటీ డిఇవో రఘురామయ్య, సీతారామపురం మండల డిప్యూటీ తహసీల్దారు, ఐసిడిసి ఉదయగిరి సిడిపిఓ లావణ్య, వరికుంటపాడు ఎంఈఓ తోట శ్రీనివాసులు, సీతారామపురం ఎంఈఓ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నకిలీ ఇన్సూరెన్స్‌లతో పట్టుబడితే చర్యలు

కావలి రూరల్, ఫిబ్రవరి 16: వాహనాలకు నకిలీ ఇన్సూరెన్స్‌లు చేసి రోడ్లపై తిరుగుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ పట్టుబడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ సుందరరావు పేర్కొన్నారు. కావలి పట్టణంలోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ భద్రతా మాసోత్సవాలల్లో భాగంగా శుక్రవారం వాహనాల బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, మారుతి, ఇఫ్కోటోకియో ఇన్సూరెన్స్ ప్రతినిధులు ఆదినారాయణ, కరీమ్, లారీ యూనియన్ అధ్యక్షుడు మండలి క్రిష్ణారావు, కార్యదర్శి రంగారెడ్డి, ఆటో, లారీ, క్యాబ్ వాహన దారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కరేడు విద్యార్థులు

ఉలవపాడు, ఫిబ్రవరి 16 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పీ శ్రీనివాసులు, పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 21 వతేది నుంచి 23 వరకు సత్తెనపల్లిలో జరిగే కబడ్డీ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులకు తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బోడ్డు శ్రీధర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

మాలకొండకు రూ.50.20 లక్షల ఆదాయం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 16 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి దుకాణాలు వేలం పాటలు ద్వారా రూ. 50.20 లక్షలు ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు తెలిపారు. మాలకొండ కల్యాణ మండపంలో కందుకూరు గ్రూపు దేవాలయం కార్యనిర్వాహణాధికారి యడ్లపల్లి బైరాగి చౌదరి పర్యవేక్షణలో శుక్రవారం దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాహన పార్కింగ్ రుసుం పాటను రూ.26.05 లక్షలు, చీరలు, జాకెట్లు విక్రయం రూ.24.15 లక్షలకు పాడుకున్నట్లు తెలిపారు. తలనీలాలు, కొబ్బరిచిప్పలు, కొబ్బరికాయ అంగళ్లు, ఫలహారశాల , పాదరక్షలు భద్రపరచు పాటలు వాయిదా పడినట్లు తెలిపారు. వాయిదా పడిన పాటలు తిరిగి ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

సామాజిక భద్రత పథకాలు వినియోగించుకోవాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 16 : సామాజిక భద్రత పథకాలయిన ప్రధానమంత్రి బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పింఛన్ యోజన పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ మేనేజర్ మహమ్మద్‌మున్వర్ తెలిపారు. మండలంలోని పోకూరులో స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమం జరిగింది. స్టేట్‌బ్యాంక్‌లలో సామాజిక పథకాలపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ రఘుకుమార్, కళాజాత బృందం సభ్యులు విజయ్, చిరంజీవి, వినోద్, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 16 : వలేటివారిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం సరస్వతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం కమల్‌కుమార్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు కష్టపడి చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, టీచర్లకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని సూచించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆదరణ కేంద్రంలో దుస్తుల పంపిణీ

బిట్రగుంట, ఫిబ్రవరి 16: బోగోలు మండలం ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలో శుక్రవారం కుందుర్తి సాయిప్రవీణ్, స్వాతిల కుమారుడు సాయిభవ్యాన్స్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు దుస్తులు, భోజనం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు వెంకట్రావు, వేణు, అశోక్, ఆదరణ కేంద్ర నిర్వాహకులు సింహాద్రిరావు, భవానీ తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల ఆవేదన ప్రభుత్వానికి అర్థం కాదా?

కావలిటౌన్, ఫిబ్రవరి 16: ఉద్యోగుల ఆవేదన ప్రభుత్వానికి అర్థం కాదా అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు జేఏసీ కావలి డివిజన్ ఛైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు.. అభివృద్ధికి చోటు : యువత

కావలి, ఫిబ్రవరి 16: తొలిసారి ఓటు హక్కు పొందిన యువకులు టీడీపీకి ఓటు. అభివృద్ధికి చోటంటూ నినదించారు. కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డిని ముసునూరులోని ఆయన నివాసంలో శుక్రవారం వారు కలిసి మద్దతు తెలిపారు. అలాగే కావలి రూరల్ మండలం సర్వాయపాలెం, చెన్నాయపాలెంకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, సానుభూతిపరులు టీడీపీలో చేరారు. ఆగ్రామాల నుంచి వారు ర్యాలీగా వస్తూ ట్రంకు రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి ఎన్టీఆర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముసునూరులో ఉన్న కావ్య నివాసానికి చేరుకుని అక్కడ పార్టీలో చేరగా కావ్య వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

ఉలవపాడు, ఫిబ్రవరి 16: మండలంలోని రాజుపాలెం సపోటా తోటలో కోడి పందేల స్థావరంపై ఎస్సై బాజీరెడ్డి శుక్రవారం దాడులు చేసి ఆరుగురిని పట్టుకుని 5 కోడిపుంజులు, రూ.10,500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సిరిపురంలో నాసిరకంగా కాలువ నిర్మాణం



సిమెంట్ బస్తాల్లో గడ్డలు చూపుతున్న టీడీపీ నేత

కావలి రూరల్, ఫిబ్రవరి 16: కావలి మండలం సిరిపురంలో మురుగునీటి కాలువల నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయంటూ శుక్రవారం స్థానికులు పనులను అడ్డుకున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా అధికారపార్టీ నేతల ధనదాహంతో నాణ్యతకు తిలోదకాలు పలికారన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అరుంధతీయ వాడలో రూ.2.90లక్షలతో మురుగు నీటి కాలువల పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కొన్ని సిమెంట్ బస్తాలు పనులు జరుగుతున్న చోట తోలారు. ఉదయం కాలువల నిర్మాణాలకు అడుగున బెడ్ వేసేందుకు సిమెంట్ బస్తాలు విప్పగా సిమెంట్ మొత్తం గడ్డలు కట్టి ఉండడంతో అవి చూసిన స్థానికులు నివ్వెరబోయి ఆవిషయాన్ని గ్రామంలోని టీడీపీ నేత గంటా మల్లికార్జున్‌కు చెప్పారు. ఆయనర ఘటనా స్థలికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా కాలువ నిర్మాణ పనులకు వినియోగించేందుకు తెచ్చిన సిమెంట్ గడ్డలు కట్టి ఉందన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, పనులు ఆపించి సిమెంట్ మార్పించామని, నాణ్యతా లోపం లేకుండా కాలువ నిర్మాణ పనులు చేపిస్తామన్నారు.

సుకుమార్ రీఎంట్రీపై మల్లగుల్లాలు

కావలి, ఫిబ్రవరి 16: కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి వైసీపీలోకి రీఎంట్రీపై పార్టీ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం కావలిలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి సుకుమార్ రీఎంట్రీపై చర్చించారు. సుకుమార్‌రెడ్డి మళ్లీ వస్తే పార్టీకి ఎంతో మేలు జరుగుతుందన్నట్లుగా భాస్కర్‌రెడ్డి చెప్పారు. ఆయన రీ ఎంట్రీ చేస్తే లాభం కన్నా నష్టమే ఎక్కువని పార్టీ కేడర్ అంటున్నది. కాగా సుకుమార్‌రెడ్డి లేకుండా ఎన్నికల నిర్వహణ కష్టమనే భావన ఒక పక్క, ఆయన్ను రీఎంట్రీ చేస్తే ప్రజలు తనను నమ్మరనే భయం మరో పక్క ఎమ్మెల్యే ప్రతాప్‌ను వెంటాడుతోంది. ఈ క్రమంలో అధిష్ఠానం ఒత్తిళ్లకు తలొగ్గి సుకుమార్‌రెడ్డిని తీసుకుంటారా.. లేక స్థానిక కేడర్‌కు భయపడి దూరంగా ఉంచుతారా..? అనేది వేచి చూడాలి.

అట్టహాసంగా 'నలందా' వార్షికోత్సవం

కావలిటౌన్, ఫిబ్రవరి 16: నలందా విద్యాసంస్థలు స్థాపించి 34 వసంతాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని డిప్యూటీ ఈవో రఘురామయ్య పేర్కొన్నారు. శుక్రవారం గాయత్రినగర్‌లోని నలందా పాఠశాలలో 34వ వార్షికోత్సవ వేడుకలు నలందా విద్యాసంస్థల ఛైర్మన్ ఎండీ మజహర్ పర్యవేక్షణలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘురామయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రతిభావంతులకు ప్రశంశాపత్రాలు, బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వెంకటసుబ్బయ్య, గోవిందయ్య, నలందా డైరెక్టర్ వసీం, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ విద్వేషానికి అమరావతి నాశనం : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 16: అమరావతి రైతుల బ్రతుకుచిత్రంపై తీసిన రాజధాని ఫైల్స్ సినిమా రాష్ట్రంలో సంచలనంగా మారిందని వాస్తవాలను ప్రతిబింబించేలా తీసిన ఈ సినిమాతో జగన్ వెన్నులో వణుకు ప్రారంభమైందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సినిమా విడుదలైన థియేటర్లలోని అధికారులను పంపించి ప్రదర్శనలను నిలిపివేసే నీచస్థితికి జగన్ దిగజారిపోయాడని పేర్కొన్నారు. 5 కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని ఛిద్రంచేసిన జగన్ రాజధాని కోసం భూములిచ్చిన 34వేల మంది రైతుల ఉసురుపోసుకున్నాడని ఆ ఫలితం అనుభవిస్తాడన్నారు.

కనుల పండువగా రథసప్తమి

కావలిటౌన్, ఫిబ్రవరి 16: పట్టణంలోని బృందావనం కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం జరిగిన రథసప్తమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాం మాల్యాద్రి పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం 5-30 గంటలకు సూర్యప్రభ వాహన సేవలతో ప్రారంభమైన సేవలు అనంతరం చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంతసేవ, చక్రస్నానం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, రాత్రి 9గంటలకు చంద్రప్రభ వాహనంతో వేడుకలు సమాప్తమయ్యాయి. ముసునూరు హనుమత్ క్షేత్రంలో కచ్చేరిమిట్ట శ్రీవారి ఆలయాల్లో రథసప్తమి వేడుకలు జరిగాయి. వెంగళరావునగర్ కొత్త శివాలయం ఆవరణలో ఉన్న సూర్య భగవానుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి పర్వదిన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు ఉదయం శాస్త్రోక్తంగా స్వామిఅమ్మవార్లకు అభిషేక, ధూప కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అలంకార మండపంలో సూర్యప్రభ వాహనంపై ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మేళతాలాలతో స్వామి వారు ఊరేగారు. రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ చిత్రం విడుదలతో వైసీపీలో వణుకు

కొండాపురం, ఫిబ్రవరి 16: రాజదాని ఫైల్స్ చిత్రం విడుదలతో ముఖ్యమంత్రి జగన్‌తోపాటు వైసీపీలో వణుకు మొదలయ్యిందని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా యాత్ర-1 చిత్రం థియేటరులలో ఆడుతున్నప్పటికీ ఎవ్వరూ ఆటంకం కలిగించలేదని, ఆదే వైసీపీ శ్రేణులు రాజధాని ఫైల్స్ సినిమా ఆడనివ్వకుండా థియేటర్లకు నోటీసులు ఇచ్చారన్నారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు నర్రా నరసింహనాయుడు భార్య విజయమ్మను ఆయన పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఉన్నారు.

కలిగిరి : ప్రజలందరూ తెలుగుదేశం పార్టీ వైపే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. శుక్రవారం కలిగిరిలో ప్రజాదీవెనలో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ విజయం సాధిస్తే ప్రజలకు అందించే ఎన్నికలమేనిఫెస్టోని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బిజ్జం క్రిష్ణారెడ్డి, కాకు మహేష్, పూసా మాల్యాద్రి, కట్టా వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలి : ఎమ్మెల్యే

కందుకూరు, ఫిబ్రవరి 16: రైతులు గిట్టుబాటు ధరలు పొందేందుకు దళారుల మాయాజాలంతో నష్టపోకుండా ఉండేందుకు ఈ మార్కెటింగ్ వెబ్ సైట్ ఎంతగానో దోహదపడుతుందని, రైతుల్లో దీనిపట్ల అవగాహన పెంపొందించేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతికి ఎదురొడ్డి అధిక ఉత్పత్తుల సాధన కోసం పోరాడుతున్నప్పటికీ గిట్టుబాటు ధరలకు ఆ ఉత్పత్తులను అమ్ముకోవటమే సవాల్‌గా మారుతున్నదన్నారు. మార్కెట్ యార్డు సెక్రటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి, వరి సాగు ఈ ఏడాది గణనీ యంగా తగ్గినందున మార్కెట్‌సెస్సు వసూళ్లలో అంచనాకన్నా రమారమి కోటి 70 లక్షలు వెనుకబడ్డామని అయితే జామాయిల్‌కు మంచిధర పలుకు తుండటంతో అదనంగా 30 లక్షలు సెస్ వసూలైందని వివరించారు. ఈ సమావేశంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు ప్రసాదు, వ్యవసాయాధి కారులు, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'టీఆర్ఆర్'ను సందర్శించిన న్యాక్ బృందం

కందుకూరు, ఫిబ్రవరి 16: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్‌బృందం శుక్రవారం సందర్శించింది. గత సంవత్సరం జరిగిన న్యాక్ అసెస్మెంట్‌లో టీఆర్ఆర్ కళాశాలకు బీ ప్లస్‌ప్లస్ గ్రేడ్ రావటం పట్ల అప్పీలుకు వెళ్లడంతో న్యాక్ బృందం తిరిగి కళాశాలను సందర్శించింది. అస్సాంలోని డాన్‌బాస్కో యూనివర్సిటీ ప్రొఫెసర్ జానీజోష్ నేతృత్వంలో మహారాష్ట్రలోని మరట్వాడా యూనివర్సిటీ ప్రొఫెసర్ డీఎం ఖందారే కో ఆర్డినేటర్‌గా ఉన్న బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టరు రాజగోపాలబాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు కళాశాలలోని విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను వివరించి న్యాక్‌లో ఉత్తమ గ్రేడ్‌కు రిఫర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలలో ఉన్న తరగతి గదులు, లేబరేటరీలు, గ్రంథాలయం, హరితవనాలతో పాటు సోలార్‌ప్యానళ్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి, భూగర్భజలాల పెంపొందించేందుకు ఇంకుడుగుంతలు ఏర్పాటు తదితరాలను వారికి చూయించారు. పరిశీలన అనంతరం కళాశాల స్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, నరేంద్ర, షేహనాజ్‌బేగం పాల్గొన్నారు.

ఆటపాటలతో అలరించిన విద్యార్థులు

ఉలవపాడు, ఫిబ్రవరి 16 : ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఏర్పాటు చేసిన ఫేర్వెల్ పార్టీలో విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం.శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సరస్వతి పూజ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జిల్లావ్యాప్తంగా రోడ్డెక్కిన రైతులు, కార్మికులు

మోదీ హటావో, దేశ్ బచావో అంటూ నినాదాలు

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్



ప్రదర్శన చేస్తున్న వివిధ రైతు సంఘాల నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16 : కేంద్రప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా రైతులు, కార్మికులు రోడ్డెక్కారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రైతులు, కార్మికులు మండిపడ్డారు. మోదీ హటావో, దేశ్ బచావో అంటూ నినదించారు. ఒంగోలులో స్థానిక కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్, బాపూజీ కాంప్లెక్స్, పాత కూరగాయల మార్కెట్ సెంటర్, ట్రంకురోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షతన జరిగిన సభలో కార్మిక సంఘాలు, వామపక్ష నాయకులు మాట్లాడుతూ మూడు నల్లచట్టాలు ఉపసంహరణ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. అదానీ, అంబానిలాంటి కార్పొరేట్ శక్తులను ప్రపంచ కుబేరులుగా మార్చడమే లక్ష్యంగా పాలనను సాగిస్తున్నారని విమర్శించారు. మూడేళ్ల క్రితం ఢిల్లీలో రైతుసంఘాల ఆధ్వర్యంలో 13నెలల పాటు సాగిన ఉద్యమం చారిత్రాత్మకమైందన్నారు. ఈ ఉద్యమంలో 700మంది రైతులు మృతిచెందారన్నారు. దీంతో ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పి వ్యవసాయ నల్లచట్టాలను రద్దుచేశారన్నారు. కానీ వాటి అమలు విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, డీవీఎన్.స్వామి, చిట్టిపాటి వెంకట్రావు, పెంట్యాల హనుమంతరావు, ఉప్పుటూరి ప్రకాశరావు, లలితకుమారి, చావలి సుధాకరరావు, దాసరి సుందరం, బి.పద్మ, జార్జి, రాజేశ్వరరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, టి.మహేష్, జి.రమేష్ సుబ్బారావు, పివిఆర్.చౌదరి, జి.శ్రీనివాసులు, ఆర్.మోహన్, ఎంఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 16: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, చట్టాలను రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అఖిలభారత రైతు కార్మిక సంఘాల గ్రామీణ బంద్‌కు మద్దతుగా శుక్రవారం స్థానిక బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షపార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గత రెండు రోజులుగా ఢిల్లీ సరిహద్దులలో సాగిస్తున్న రైతాంగ ఉద్యమాన్ని బలపరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, కేఎల్డీ ప్రసాద్, పి.తిరుపతిరెడ్డి, ఆదాం, వెంకటేశ్వర్లు, కాకార్ల వెంకటేశ్వర్లు, కేవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్టూరులో...

మార్టూరు, ఫిబ్రవరి 16: గ్రామీణ బంద్ మార్టూరులోనూ పాటించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమం జరిగింది. మార్టూరు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు, పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తదితర కార్యాలయాలను మూసివేశారు. కార్యక్రమంలో పాలెపు సాంబయ్య, వీరవల్లి కృష్ణమూర్తి, గొట్టిపాటి శేషాద్రి, సూరిబాబు, గోనుగుంట్ల మోహనరావు, నాగేశ్వరరావు, సదాశివరావు, బాషా, సుజాత, బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌కు జేడీ శీలం మద్దతు

పంగులూరు, ఫిబ్రవరి 16: పంగులూరులో శుక్రవారం భారత్‌బంద్ విజయవంతంగా జరిగింది. వామపక్ష, ప్రతిపక్షాల నేతలు, ప్రజాసంఘాల నాయకులు స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులతోపాటు పాఠశాలలను మూసివేయించారు. దేశవ్యాప్త గ్రామీణ బంద్‌కు ప్రజలంతా స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. బంద్‌కు కేంద్ర మాజీ మంత్రి జేడీశీలం బంద్‌లో పాల్గొని మద్దతు తెలిపారు. మండలంలోని ముప్పవరం, బైటమంజులూరు గ్రామాలలో బంద్ చేపట్టారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం అధ్యక్షుడు వినోద్‌బాబు, రాయిణి కృష్ణకుమారి, మల్లారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు రామచంద్రరాజు, లక్ష్మణరాజు, సుబ్బరాజి, ఆదుం సాహెబ్, తలపనేని సుబ్బారావు, తానికొండ సుధాకర్, చిలుకూరి కోటయ్య, ఆదుం సాహెబ్, వెంకటేశ్వర్లు, సీత, శింగమ్మ, సీతారావమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

చీరాలటౌన్, ఫిబ్రవరి 16: కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన గ్రామీణ బంద్, కార్మిక సమ్మె కార్యక్రమంలో భాగంగా దేవాంగపురి వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

పర్చూరులో...

పర్చూరు, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల ను విడనాడాలని రైతుసంఘం జిల్లా నాయకుడు బండి శంకరయ్య అన్నారు. సీఐటీయూ, రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్‌లో నిరస ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బండారు చినదాసు, కొమ్మినేని శ్రీనివాసరావు, క ట్టెంపూడి డేవిడ్‌బాబు, ఆర్.బుల్లయ్య, ఆళ్ళ వెంకట్రామయ్య, కె.శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 16: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌జీవో, అద్దంకి తాలుకా యూనిట్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ, బకాయిలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ అన్నింటిని వెంటనే ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జేఏసీ అద్దంకి తాలుకా అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, కార్యదర్శి తాళ్ళూరి రమేష్‌బాబు, ఏడుకొండలు, రవికుమార్, అర్జునరావు, శ్రీనివాసరావు, సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ప్రత్యేకపూజలు

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 16: వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పార్వతీపురంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం పంచవటి రామలింగేశ్వరస్వామి శివశక్తి పీఠం క్షేత్రం 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బట్టా అనంత లక్ష్మి, లీలానందప్రసాద్, దంతం వెంకట సుబ్బారావు, చంద్రమోహన్, మంతు, బండికళ్ల నరేష్, షేక్ కజ్జిబాబు, యారాసు శ్యామ్, లేళ్ల భాస్కరరావు, అందే కృష్ణ, ఖాదర్, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 16: రాయితీపై అందిస్తున్న ప్రభుత్వ పథకాలను మత్స్య కారులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ మత్స్య సహాయకులు డి.ప్రతిభ, షేక్ కాలేషా అన్నారు. పెదగంజాం గ్రామ సంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, ఏటిమొగ, ప్రశాంతినగర్, కాటంవారిపాలెం, కోడూరివారిపాలెం గ్రామాల్లోని మత్స్యకారులకు పల్లెపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం సేఫ్టీ పరికరాలను అందజేశారు. రాష్ట్రీ య కృషి వికాస్ యోజన పథకం ద్వారా 75 శాతం రాయితీపై లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లు, జీపీఎస్‌లను 16 మంది మత్స్యకారులకు అందజేశారు. కార్యక్రమంలో సా గరమిత్రలు కౌసల్య, ఎల్లావుల వెంకటేష్, మత్స్యకారులు పాల్గొన్నారు.

కలిసొచ్చిన అడ్డంకులు

ఇంకొల్లులో చంద్రబాబు రా కదిలిరా సభకు పౌరుషంగా కదులుతున్న టీడీపీ శ్రేణులు

ఈ నాలుగు సెగ్మెంట్లలోనే సమాయత్తం

టీడీపీలోకి పెరిగిన వలసలు కూడా అదనపు బలం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారపార్టీ వేధింపులు, అక్రమ కేసులు, అవినీతి వ్యవహారాలతో విసిగి వేసారుతున్న ప్రజల అసంతృప్తికి ప్రభుత్వం మరింత ఆజ్యం పోసింది. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో కదలాలా వద్దా అనుకుంటున్న టీడీపీ శ్రేణుల్లోను పౌరుషాన్ని రగిలించింది. ఇందుకు చంద్రబాబు సభను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేసిన కుట్రలు కుతంత్రాలే కారణమయ్యాయి. శనివారం ఇంకొల్లులో జరిగే రా..కదలిరా సభకు బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఆయా ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు భారీగా కదిలొచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి ఆ సభకు భారీగా శ్రేణులు హాజరయ్యే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు ఒకటి రెండు నియోజకవర్గాలలో అభ్యర్థులు దొరకని పరిస్థితి, రెండుచోట్ల కొత్తవారిని రంగంలోకి దింపినా కుదుటపడని పరిస్థితులతో ఉన్న వైసీపీ నుంచి ఇటీవల వలసలు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇంకొల్లులో జరిగే బాబు సభను అడ్డుకునేందుకు ప్రభుత్వం సర్వప్రయత్నాలు చేసి విఫలం చెందింది. సభకు అడ్డంకులు కల్పించాలన్న ప్రభుత్వ ప్రయత్నమే టీడీపీ నేతల్లో పౌరుషాన్ని రగిలించింది.

అడ్డంకులతో ఇబ్బందులు

అన్ని లోక్‌సభ నియోజకవర్గంలలో రా.కదలిరా పేరుతో తెలుగుదేశం, జనసేనలు ఎన్నికల శంఖారావం సభలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా శనివారం ఇంకొల్లులో సభ జరగనుంది. సభ నిర్వహణలో కీలక పాత్రధారి అయిన ఎమ్మెల్యే, బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావుకు తొలిరోజే నోటీసులిచ్చి భయాందోళనకు గురిచేసే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. అయినా వెనక్కు తగ్గకపోవటంతో సభా నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్న పొలం దేవదాయ శాఖకు చెందిందని, పనులు ఆపేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. అయితే భూమి దేవాదాయ శాఖకు చెందినప్పటికీ లీజుదారుడైన రైతు ముందుకొచ్చి అక్కడ సభ నిర్వహణకు తానే అనుమతించాను, దమ్ముంటే అరెస్టు చేసుకోండని సవాల్ చేయటంతో ప్రభుత్వ యంత్రాంగం వెనుకడుగు వేసింది. ఈ సభ నిర్వహణను అడ్డుకునేందుకు అధికారపార్టీ ప్రయత్నం చేయటంలో ప్రత్యేకత లేకపోలేదు.

బాపట్ల లోక్‌సభ స్థానం టీడీపీకి పెట్టని కోట. గత ఎన్నికల్లోను ఈ లోక్‌సభలో నాలుగు అసెంబ్లీ స్థానాలను టీడీపీ గెలిచింది. పైగా ప్రస్తుతం పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు ఏలూరి, రవి, సత్యప్రసాద్‌లతోపాటు మాజీ మంత్రి ఆనంద్‌బాబు ఇతర నియోజకవర్గాలలోని నాయకులు రాజకీయంగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్‌ను ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నం చేశారు. అదే తరహా ప్రయత్నం ఎమ్మెల్యే ఏలూరి మీదా చేశారు. చీరాలలో గెలుపొందిన బలరాంను తమ పార్టీలోకి తీసుకున్నారు. అయినా బాపట్ల లోక్‌సభలో టీడీపీ కార్యక్రమాల నిర్వహణలో ఏమాత్రం తగ్గలేదు. మరోవైపు అధికార వైసీపీ పరిస్థితి చూస్తే అయోమయంగా తయారైంది. పర్చూరు నుంచి రంగంలోకి దించాలని జగన్ భావించిన ఆమంచి పలాయనం చిత్తగించాడు. ఇప్పటికీ అక్కడ వారు అనుకున్న స్థాయి అభ్యర్థి దొరక్క వైసీపీ అధిష్ఠానం కుస్తీ పడుతోంది. అద్దంకి, ఎస్ఎన్‌పాడులకు గుంటూరు జిల్లా నుంచి నాయకులను దిగుమతి చేశారు. చీరాలలో ఆమంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రేపల్లెలో మోపిదేవిని కాదని కొత్తవారికి అవకాశం ఇవ్వటంతో ఉన్న కాస్త పరిస్థితి దిగజారింది. వేమూరులోను మంత్రి నాగార్జునను మార్పు చేసి ఆ జిల్లాకు సంబంధంలేని ప్రకాశం జిల్లా వాసినిని తీసుకెళ్లి రంగంలోకి దింపారు. ఇన్ని చిత్ర విచిత్ర వ్యవహారాలకు వైసీపీ పాల్పడగా కిందిస్థాయిలో శ్రేణులు, నాయకత్వం పోలోమని టీడీపీలోకి వలస పోతున్నారు. అద్దంకిలో అయితే ఓటు బ్యాంకులుగా చెప్పుకోదగిన వైసీపీ నాయకుల్లో అత్యధిక భాగం టీడీపీలోకి క్యూకట్టారు. పర్చూరులోను వలసలపర్వం పెరిగింది. ఎస్ఎన్‌పాడు, చీరాలలో అంతర్గత కుమ్ములాటలు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మరింత బహిర్గతం అయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కీలకమైన పర్చూరు నియోజకవర్గంలో బాబు సభ జరిగి అది విజయవంతమైతే నష్టం అని అధికారపార్టీ భావించింది. అందుకే సభాను అడ్డుకునే ప్రయత్నం చేసి విఫలమైంది. అయితే ఈ ప్రయత్నం వలన టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహాన్ని రగిలించింది. ముమ్మరమైన వ్యవసాయ పనులతో ఉన్న రైతులు, కూలీలు తాజా పరిణామాలతో ఇంకొల్లు సభకు పెద్దఎత్తున తరలేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ నాయకులు ఆశించిన లక్షన్నర మంది వస్తారో లేదో కానీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచే లక్షమందికిపైగా హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమైంది. సభ జరిగే పర్చూరు నుంచి 50 వేలమంది హాజరయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

పట్టా ఫైట్!

కోర్టుకెళ్లింది సొంత పార్టీ వారే

బయటి వారేనంటూ బాలినేని చేసిన వ్యాఖ్యలకు ఆధారాల్లేవ్

సీఎం హడావుడి రాకలో ఎన్నికల వ్యవహారమే కీలకం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ఒంగోలులో పేదలకు పెద్దసంఖ్యలో నివాసస్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే ఇంటాబయట సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించేవారు ఎవరో కూడా అర్థంకావటం లేదు. హైకోర్టులో పిల్ వేసిన వారు ఎవరనేదీ అర్థంకావటం లేదు' అని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. పరిస్థితిని పైనుంచి చూసే వారికి అది నిజమే కదా అని అనిపిస్తుంది. కానీ లోతుగా అధ్యయనం చేస్తే అందులో అర్థంకాని పరిస్థితి ఏమీ లేదనే విషయం తేటతెల్లమవుతుంది. వెనువెంటనే పేదలకు పట్టాలు ఇవ్వాలన్న ఆతృతతో పనిచేస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంలో అక్రమాలు ఉన్నాయంటూ మున్సిపల్ మాజీ మాజీ వైస్ చైర్మన్, వైసీపీ నేత సింగరాజు రాంబాబు హైకోర్టులో పిల్ వేసిన మాట నిజం. అయితే ఈ నేపథ్యంలో శుక్రవారం బాలినేని ఒంగోలులో మీడియాతో మాట్లాడుతూ ఇంటాబయటా ఎదురవుతున్న సమస్యలతో అల్లాడిపోతున్నాను. ఎవరు చేస్తున్నారో అర్థం కావటం లేదంటూ పట్టాల పంపిణీ విషయంలో హైకోర్టులో పిల్ వేసిన అంశంపై వ్యాఖ్యలు చేశారు. కానీ పరిశీలించి చూస్తే అందులో శోధించాల్సిన అంశం ఏమీ లేదు. హైకోర్టులో పిల్ వేసింది సింగరాజు రాంబాబు. ఆయన గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి బాలినేనికి మద్దతుగా పనిచేశారు. ఆ తర్వాత చాలాకాలం ఆయనతోనే ఉన్నారు. కారణాలేమైనప్పటికీ విభేదించిన తర్వాత అదే పార్టీలో ఉంటూ టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పక్కన చేరారు. సొంత బావ బావమరుదులు అయినప్పటికీ బాలినేనికి వైవీకి మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. బాలినేనితో విభేదించిన రాంబాబు ఆయా సందర్భాలలో వైవీకి మద్దతుగా నిలబడ్డాడు. ఇది బహిరంగంగా ఆ పార్టీశ్రేణులతోపాటు ఒంగోలులోని రాజకీయ నాయకులందరికీ తెలిసిన నగ్నసత్యం. పైగా సొంత కుటుంబం వారైనా ద్వేషిస్తే తిరిగి దగ్గరకు రానివ్వడు అనే నానుడి టీడీపీ నేత దామచర్ల జనార్దన్‌పై ఉంది. ఆయనకు కానీ టీడీపీ శ్రేణులకు కానీ రాంబాబు దగ్గరవుతున్న దాఖలాలు ఇంతవరకు కనిపించలేదు. ఈ నేపథ్యంలో బాలినేని భావించినట్లు ఇంటి సమస్యే తనను వెంటాడుతుందన్న విషయం తేటతెల్లమవుతోంది. అందులో ప్రధానమైన ఈ సమస్యను ఆయన పార్టీపరంగా పరిష్కరించుకోవాలే తప్ప మరో సాకు చూపే అవకాశం కనిపించటం లేదు. అయితే న్యాయనిపుణుల అభిప్రాయాల మేరకు రాంబాబు హైకోర్టులో వేసిన పిల్‌లోని అంశాలు నివాసస్థల పట్టాల పంపిణీకి అడ్డంకాబోవని అర్థమవుతోంది. ఈ సమస్యకు తోడు ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెల్లడయ్యే అవకాశం ఉండటంతో పట్టాల పంపిణీని తన చేతులమీదుగా పూర్తిచేసేందుకు సీఎం సిద్ధమయ్యారు. ఆయన ముందుగా 20వతేదీనే ఒంగోలు రావాలని నిర్ణయించుకోవటంలోని ఆంతర్యం అదే. అయితే 25 వేలమందికి పట్టాలు సిద్ధం చేయగా లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయింది. గతంలో భరోసా పత్రాలు ఇచ్చిన వారిలో కొందరు కాంట్రాక్టు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరి అర్హతను కోల్పోయారు. అలాంటి వారు కూడా వెయ్యిమందికిపైగా ఉన్నారు. దీంతో మరో ఆరేడు వేలమంది కొత్త లబ్ధిదారులను గుర్తించాల్సిన అవసరం వచ్చింది. ఈ విషయంలోనే అధికారపార్టీ వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతోంది. ఇన్ని అడ్డంకుల మధ్య ఎన్నికల వేళ వ్యవహారం ఏమలుపు తిరుగుతుందనేది సందిగ్ధంగా మారింది.

పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా గుత్తా

వ్యాపారుల కోటాలో అవకాశం

చైర్మన్, వైస్ చైర్మన్ రెండు దక్షిణాదికే

కర్ణాటకలో 100 మిలియన్‌ల ఉత్పత్తికి అనుమతి, పొగాకు బోర్డు నిర్ణయం



వాసుబాబును అభినందిస్తున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్‌బాబు, సెక్రటరీ వేణుగోపాల్

ఒంగోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భారత పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా ఒంగోలుకు చెందిన పొగాకు వ్యాపారి గుత్తా వాసుబాబు ఎన్నికయ్యారు. గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ ఎన్నికల జరిగింది. జడ్పీ మాజీ చైర్మన్, ప్రముఖ పొగాకు వ్యాపారి అయిన దివంగత గుత్తా వెంకటసుబ్బయ్య కుమారుడైన వాసుబాబు ఆ వ్యాపారంలో కొనసాగుతున్నారు. బోర్డులో వ్యాపారుల ప్రతినిధుల కోటాలో 2022 సెప్టెంబరులో డైరెక్టర్‌గా నియమితులైన ఆయన ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. బోర్డు చైర్మన్‌ను కేంద్రం నియామకం చేస్తుండగా వైస్ చైర్మన్‌గా పాలకమండలిలో ఉండే రైతు, వ్యాపార ప్రతినిధులకు రోటేషన్ పద్ధతిలో అవకాశం వస్తుంది. అయితే మూడు విడతలుగా రైతు ప్రతినిధులే ఎన్నిక అవుతుండగా ఇప్పటివరకు కర్ణాటకు చెందిన రైతు ప్రతినిధి ఉన్నారు. ఆయన పదవి కాలం ముగియడంతో శుక్రవారం జరిగిన పాలక మండలి సమావేశంలో వైస్ చైర్మన్ ఎన్నిక జరిగింది. ఈసారి కూడా తమ ప్రతినిధికే అవకాశం ఇవ్వాలని అది కూడా ఆంధ్ర ప్రాంతానికి కేటాయించాలని సమావేశంలో రైతు ప్రతినిధులు పట్టుపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం రైతు ప్రతినిధులుగా జిల్లాకు చెందిన వారే ముగ్గురు ఉండగా వారిలో బీజేపీకి చెందిన వారైన పొద ప్రసాదరావు, బ్రహ్మయ్యలు గట్టిగా ప్రయత్నించారు. వ్యాపారుల ప్రతినిధులు మాత్రం ఈ విడత తమకు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈక్రమంలో యువకుడైన గుత్తా వాసుబాబును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. దీంతో కీలకమైన చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు రెండు దక్షిణాదికే దక్కాయి. కందుకూరు నియోజకవర్గం నలదలపూడికి చెందిన చిడిపోతు యశ్వంత్‌కుమార్ ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతుండగా ఒంగోలు వాసి అయిన గుత్తా వాసుబాబు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే వాసుబాబు స్వగ్రామం కూడా కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెం కావడం విశేషం. నూతనంగా వైస్ చైర్మన్‌గా ఎన్నికైన వాసుబాబును బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్‌బాబు, సెక్రటరి దివి వేణుగోపాల్ ఇతర అధికారులు, బోర్డు సభ్యులు అభినందించారు. ఇదిలా ఉండగా రానున్న ఏడాది(2024-25) కర్ణాటకలో పంట ఉత్పత్తి పరిమాణాన్ని కూడా ఈ సమావేశంలో ఖరారు చేశారు. రెండేళ్లుగా కర్ణాటకలో 100 మిలియన్ కిలో ఉత్పత్తికి అనుతి ఇస్తుండగా వచ్చే ఏడాది కూడా ఆలాగే అనుమతి ఇస్తూ శుక్రవారం నాటి బోర్డు సమావేశంలో తీర్మానించింది.

20న ఒంగోలుకు సీఎం రాక

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఆగ్రహారంలో స్థలాల లేఅవుట్ పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఒంగోలు నగరంలోని అర్హులైన పేదలకు ఈనెల 20వతేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిచేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు, పట్టాల ప ంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఎన్. అగ్రహారంలోని లే అవుట్‌లో మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించడంతో పాటు పట్టాల పంపిణీకి తీసుకోనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన లే అవుట్ మ్యాపులను పరిశీలించారు. అనంతరం అక్కడ సీఎం పర్యటనపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్‌దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఒంగోలులోని పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు ఈనెల 20న సీఎం వస్తున్నారని తెలిపారు. ఒంగోలులోని పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన భూ సేకరణకు, లే అవుట్‌లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ 231 కోట్లు మం జూరు చేసిందన్నారు. ఎన్, అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కలపాలెం, యరజర్లలో 540 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 460 ఎకరాలు భూసేకరణ చేసినట్లు తెలిపారు. మరో 60 ఎకరాలను భూసేకరణ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లే అవుట్‌లో పట్టాలు పంపిణీ చేసేందుకు ప్లాట్ల ఏర్పాటుతో పాటు రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలు క ల్పించేందుకు కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 22వేల మం దికి పట్టాలు పంపిణీతో పాటు 15వేల మందికి హౌసింగ్ మంజూ రు పత్రాలను కూడా సీఎం చేతుల మీదుగా అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సభా వేదిక, హెలిప్యాడ్ ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాలు, సీఎం కాన్వాయ్ రూటు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ(అడ్మిన్) కే నాగేశ్వరరావు, ఎఎస్పీ(క్రైం) శ్రీధర్‌రావు, అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఎం, కిషోర్‌బాబుతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

రెండో రోజు కొనసాగిన ఆందోళన

జేఏసీ పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల ఆందోళన



రిమ్స్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: తమ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లావ్యాప్తంగా రెండో రోజైన శుక్రవారం ఆందోళనలు కొనసాగించారు. ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనలు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఒక చోటకు చేరి ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ కూచిపూడి శరత్‌బాబు నాయకత్వంలో స్థానిక రిమ్స్ వద్ద ఉద్యోగులు ఈ నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇదే విధానాలను అవలంభిస్తే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తోందని శరత్‌బాబు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి మంజేష్, శివకుమార్, వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, షరీఫ్, ప్రసన్న, కిషోర్, సునీల్, రోజ్‌కుమార్, మాధవి, కోటేశ్వరమ్మ, రత్నారాణి, విజయ, సాల్మన్‌రాజు, భాస్కర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 16: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పలువురిని పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని పసుమర్తిపాలెంలో వంగివరపు క్రాంతిసరళ డెంగ్యూ జ్వరంతో ఇటీవల మృతిచెంద గా కుటుంబసభ్యులను పరామర్శించారు. 8వ వార్డులో దిడ్డి శ్రీనివాసరావు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకోగా ప రామర్శించారు. వెంపరాలలో సోమాబత్తిన అంజయ్య, కంచర్ల చినముత్తయ్యను పరామర్శించారు.

భక్తి శ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

చినగంజాం, ఫిబ్రవరి 16: మండలంలో రథసప్తమి వేడుకలను శుక్రవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పలుగ్రామాల్లోని దేవాలయాల్లో సూర్య జయంతిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా భక్తులు జిల్లేడు, చిక్కుడు ఆకులను తలపై పెట్టుకొని స్నానమాచరించి, పొంగళి నైవేద్యంగా తయారుచేసి సూర్యభగవానునికి నివేదించారు. రథసప్తమి నాడు జిల్లేడు, రేగు, రాగి ఆకులను తలపై పెట్టుకుని శిరస్నానం చేయడంవల్ల మానసిక, దృఢత్వం, జ్ఞాపకశక్తి పెరుగుతాయిని, శారీరక సంబంధమైన రుగ్మతలు నశిస్తాయిని పెద్దల నమ్మకం. మండల పరిధిలోని పలుదేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు.

'రా కదలిరా' సభకు తరలిరావాలి

మార్టూరు, ఫిబ్రవరి 16 : ఇంకొల్లులో శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న రా కదలిరా సభకు తరలిరావాలంటూ శుక్రవారం మార్టూరులో తెలుగు మహిళలు ఇంటింటా తిరుగుతూ బొట్టుపెట్టి మహిళలను ఆహ్వానించారు. తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు ఉప్పుటూరి రమాదేవి ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ చంద్రబాబు సభకు కుటుంబాలతో సహా తరలిరావాలని కోరారు. విద్యానగర్, కాకతీయనగర్, ఎంఎస్ఎన్ కంపెనీ తదితర ప్రాంతాల్లో మహిళలు ఇంటింటా పర్యటించారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సింగరాయకొండ, ఫిబ్రవరి 16 : రైల్వేస్టేషన్‌లోని ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై శుక్రవారం ఉదయం 40 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అతని కుడి కన్నుపై రక్తగాయం, నోటి నుంచి నురుగు బయటకు వచ్చి ఉంది. మృతుడు వంకాయ రంగు నిండు చేతుల చొక్కా, కాఫీరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న ఒంగోలు జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సెల్ ఫోన్ నెంబర్లు : 94409 04870, 70139 15467ను సంప్రదించాలని జీఆర్పీ పోలీసులు కోరారు.